TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 158 | మంగళవారం 02-06-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

## రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు నోటిఫికేషన్



ఏపీ సహా 10 రాష్ట్రాల్లోని రాజ్యసభ స్థానాలకు, మూడు రాష్ట్రాల శాసన మండలి స్థానాల కు ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. జూన్ 18న ఎన్నికలు నిర్వహించనున్నట్టు వెల్లడించింది. జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ స్థానాలతో పాటు పదవీకాలం ముగియకుండానే ఖాళీయైన మూడుస్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో మొత్తం 27 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నేటి నుంచి ఈ నెల 8వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. బిహార్‌లోని తొమ్మిది రాష్ట్ర శాసన మండలి స్థానాలకు ఎన్నికలు జరగనుండగా ఒక స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు.

## 30 ఏళ్లలో తొలిసారి.. 'టెర్రర్ ఫ్రీ మంత్'గా మే



శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో ఒక్క ఉగ్రవాద సంబంధిత హత్య గానీ, దాడి గానీ జరగని నెలగా 'మే 2026'ను అధికారులు గుర్తించారు. గత 30 ఏళ్లలో ఎలాంటి ఉగ్ర చర్యలు జరగని మాసం అంటూ లేదని ఏదీ లేదని, తొలిసారి ఈ మే నెలలో ఒక్క దాడి కూడా జరగలేదని వారు పేర్కొన్నారు. అధికారిక గణాంకాల ప్రకారం, ఈ ఏడాది మొదటి ఐదు నెలల్లో కేవలం 12 ఉగ్రవాద సంబంధిత మరణాలు నమోదయ్యాయి. అయితే, వీటిలో సామాన్య పౌరులెవరూ చనిపోలేదు. అత్యధికంగా 2000 సంవత్సరం మే నెలలో 288, 2001 మేలో 300 ఉగ్రవాద సంబంధిత మరణాలు నమోదయ్యాయి.
2001లో జమ్మూ కశ్మీర్ లోని పలు ప్రాంతాల్లో దాదాపు ప్రతిరోజూ ఉగ్ర ఘటనల్లో పౌరులు, ఉగ్రవాదులు, భద్రతా సిబ్బంది మరణించేవారు. రోజులు గడుస్తున్న కొద్దీ మరణాల తీవ్రత క్రమంగా తగ్గుతున్నప్పటికీ హింసాత్మక ఘటనలు మాత్రం కొనసాగుతునే ఉండేవి. 2002లో మేలో ఉగ్రవాద సంబంధిత హత్యల సంఖ్య -288గా ఉండగా.. పేజి 2లో ▶

## స్పోర్ట్స్ కోటాపై ఆరోపణలు అవాస్తవం: అజయ్ జైన్

- డీఎస్సీలో 431 పోస్టులు స్పోర్ట్స్ కోటాకు
- 3,600 మంది దరఖాస్తులు
- 382 మంది మెరిట్ ఆధారంగా ఎంపిక
- 39 పోస్టులు ఖాళీగా ఉన్నాయి
- ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకమని స్పష్టం
- అన్ని ఫిర్యాదులు పరిష్కరించామని వెల్లడి
- స్పోర్ట్స్ కోటా ఎంపికలు సక్రమంగానే జరిగాయని ప్రకటన




2లో

## ఎన్నో పోరాటాల ఫలితమే విశాఖ రైల్వే జోన్:

- ఎన్నో పోరాటాల ఫలితమే రైల్వే జోన్
- లక్షలాది ప్రయాణికులకు ప్రయోజనం
- రైల్వే అభివృద్ధితో ఉత్తరాంధ్ర అభివృద్ధి
- పార్లమెంట్‌లో నిరంతరం పోరాటం చేశా
- ఇచ్ఛాపురం స్టేషన్‌కు రూ.12 కోట్ల అభివృద్ధి
- బ్రిడ్జి సమస్యకు త్వరలో పరిష్కారం




2లో



## వర్షాభావంపై రైతులకు అవగాహన

- నీటి వినియోగం తక్కువున్న పంటలపై వివరణ
- పంటల మార్పిడి, వైవిధ్యంపై రైతులకు తెలియచేయాలి
- దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునరుద్ధరణ
- అత్యవసర పనుల కోసం వేయికోట్ల నిధులతో పనులు
- వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో సిఎం సమీక్ష
- స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డి



వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తక్కువ నీరు వినియోగించుకునే పంటలపై రైతులకు వివరించాలన్నారు. పంట మార్పిడి ప్రాధాన్యాన్ని అన్నదాతలకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నైరుతి రుతుపవనాలతో వచ్చే వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, ఇతర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణలో ప్రాజెక్టుల మెయింటెనెన్స్ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. గేట్లు, నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌కు అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వినియోగించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



దిల్లీ: దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ?ఇటీవల ఝార్ఖండ్‌లో పర్యటించిన భట్టి విక్రమార్క.. అక్కడి సీఎం హేమంత్ సోరెన్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరిపారు. పార్టీ వ్యవహారాలకు సంబంధించి ఓ నివేదికను రూపొందించారు. ఆ నివేదికను తాజాగా కేసీ వేణుగోపాల్‌కు అందజేశారు.

## డఫాబెట్.. బెట్టింగ్ కేసులో 11 మందిని అరెస్టు చేసిన సీఐడీ



మిగతాది 2లో

హైదరాబాద్: ఆర్థిక నష్టం కలిగిస్తూ, యువత ఆత్మహత్యలకు కారణం అవుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై తెలంగాణ సీఐడీ ప్రత్యేక దృష్టి సారించింది. వీటిపై ఇప్పటికే సిట్ ఏర్పాటు చేసిన సీఐడీ.. ఓ కేసు దర్యాప్తులో భాగంగా అంతర్జాతీయ బెట్టింగ్ రాకెట్‌ను ఛేదించింది. బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ 'డఫాబెట్' వేదికగా మోసాలకు పాల్పడుతున్న 11 మందిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు.

## లాభాలు సంపాదించే పరిశ్రమలు పన్నులు చెల్లించకపోతే ఎలా?: పవన్



- పరిశ్రమలు పన్నులు తప్పనిసరిగా చెల్లించాలి: పవన్
- పంచాయతీ పన్ను బకాయిలపై ఆగ్రహం
- ఆంధ్రా పేపర్ మిల్స్‌కు రూ.19 కోట్లు బకాయిలు
- విద్యాసంస్థల వద్ద కూడా భారీ బకాయిలు
- పన్నులు వసూలైతే రూ.5,400 కోట్ల ఆదాయం
- రాజకీయ ఒత్తిళ్లకు లొంగొద్దు
- ప్రత్యేక డ్రైవ్‌తో పన్నుల వసూళ్లు
- సీఎంతో, మంత్రివర్గంతో చర్చిస్తా: పవన్

అమరావతి: పరిశ్రమలు, ప్రైవేటు విద్యా సంస్థలు సరిగా పన్నులు చెల్లించకపోవడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ అధికారులతో గ్రామపంచాయతీలకు రావాల్సిన పన్నులపై పవన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. లాభాలు సంపాదించే పరిశ్రమలు పంచాయతీలకు పన్నులు చెల్లించకపోతే ఎలా? అని అసహనం వ్యక్తం చేశారు.
"గ్రామాల్లో వనరులు వాడుకుంటూ పన్నులు కట్టకపోవడమేంటి?. ఆంధ్రా పేపర్ మిల్స్ రూ.19 కోట్లు బకాయిలు పెట్టింది. విద్యాసంస్థలకు సంబంధించి కూడా భారీగా బకాయిలు ఉన్నాయి. రాష్ట్రంలో పంచాయతీ పన్నులు వసూలైతే రూ.5,400 కోట్లకుపైగా వస్తాయి. పేదలు, కులవృత్తులవారు, చిరుద్యోగులు కూడా పన్నులు చెల్లిస్తున్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు పన్నులు కట్టని విషయం ప్రజలకు తెలియదు. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా పన్ను వసూళ్ల విషయంలో ముందుకెళ్లాలి. సీఎంతోపాటు మంత్రివర్గంతోనూ నేను మాట్లాడతా. పల్స్ సర్వే తరహాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్ను వసూళ్ల కార్యాచరణ చేపట్టాలి"అని అధికారులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## మహారాష్ట్ర సీఎంతో ఏపీ మంత్రి లోకేశ్ భేటీ..

**పెట్టుబడులు, విద్యావిధానాలపై చర్చ**

- విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కోరిన లోకేశ్
- ఏఐ హబ్‌గా వైజాగ్ ఎదుగుతోందని వెల్లడి



మిగతాది 2లో

- మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌తో లోకేశ్ భేటీ
- పెట్టుబడులు, విద్యా సంస్కరణలపై చర్చ
- స్కిల్ డెవలప్‌మెంట్ విధానాలు వివరించిన లోకేశ్
- మహారాష్ట్ర ఉత్తమ విధానాలపై ఆరా
- ఎయిర్‌ట్రంక్ సీఈవోతో సమావేశం

## ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసీఆర్‌కు మళ్లీ ఓట్లు అడిగే హక్కు లేదు




మిగతాది 2లో

హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం పౌరుల హక్కులను హరించిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వ్యక్తుల కుటుంబాల్లోకి తొంగిచూసి, బెదిరించి లొంగదీసుకోవాలని చూశారని మండిపడ్డారు.

## కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణే ఉత్తమమైంది: టీజీపీఎస్సీ ఛైర్మన్



మిగతాది 2లో

హైదరాబాద్: తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదని, టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేసేవారు ఎప్పుడూ ఉంటారని అన్నారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేస్తామని చెప్పారు.

# సంపాదకీయం

## చాయిస్ ఈజ్ యువర్స్ మిస్టర్ జగన్‌రెడ్డి!

తమ కుటుంబంలో జరిగిన మూడు మరణాలను ప్రస్తావించడం ద్వారా మళ్లీ సానుభూతి పొందాలని జగన్ ప్రయత్నిస్తున్నారేమో తెలియదుగానీ తమ కుటుంబ రక్త చరిత్రను ఆయనే బయటపెట్టుకున్నారు. రాజారెడ్డి (వైఎస్ తండ్రి) ఎలాంటి వారు? ఎన్ని నేరాలు చేశారు? వంటి విషయాలను తాను సీఎం అయ్యాక ప్రజలు మరచిపోయేలా రాజశేఖరరెడ్డి చేయగలిగారు.
పోయినోళ్లందరూ మంచోళ్లని సర్దుకుపోయే ఉదారవాదం మన నైజం కాబట్టే మరణానంతరం వైఎస్ 'మహానేతగా' మారిపోయారు. నిజానికి రాజారెడ్డి కంటే వైఎస్సే 'డేంజరస్' అని సీమకు చెందిన, మరీ ముఖ్యంగా కడపకు చెందిన ఆయన ప్రత్యర్థులు గజగజ వణుకుతూ వారికి ఎదురైన భయానక అనుభవాలను చెబుతుంటారు.
వైఎస్ మరణాన్ని కొంతకాలం, వివేకానంద రెడ్డి హత్యను మరికొంత కాలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్న జగన్ రెడ్డి తాను తులసి మొక్కను అని చెప్పుకోవడాన్ని మించిన జోక్ మరేమి ఉంటుంది?
మనం మంచివాళ్లం అవునా కాదా అన్నది ముందుగా మన కుటుంబ సభ్యులే సర్టిఫికెట్ ఇవ్వాలి. జగన్ ఉత్తమ మానవుడు అని వైఎస్ కుటుంబ సభ్యుల్లో ఒక్కరైనా సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వడం లేదన్న ప్రశ్నకు సమాధానం రావాలి కదా? నిజానికి వైఎస్ కుటుంబానికి ప్రారంభంలో ఆస్తిపాస్తులు పెద్దగా లేవు. రాజారెడ్డి తండ్రి వెంకటరెడ్డి చాలా చిన్న రైతు. రాజారెడ్డి ఫ్యాక్షన్ మార్గాన్ని ఎంచుకున్న తర్వాత వైఎస్ కుటుంబానికి ఆస్తులు సమకూరడం మొదలైంది. వైఎస్ సీఎం అయ్యాక జగన్ విన్యాసాలు చూశాం. ఈ దేశ చరిత్రలోనే ఎవరూ నిర్మించలేని విధంగా వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. పేర్ల పార్థసారథి రెడ్డి చెబుతున్నట్టుగా రాజారెడ్డి కుటుంబం రక్తపు కూడు తిని పెరిగిందన్న మాట!
జగన్ గురువారం విలేకరుల సమావేశంలో నా పేరు కూడా ప్రస్తావించారు. పేరు ప్రస్తావనకే పరిమితం కాకుండా అమరావతిలో ప్లాట్ల కేటాయింపులో నా కుమారుడు, కుమార్తె అనుచిత లబ్ధి పొందినట్టుగా ఆరోపణలు చేశారు.
..నువ్వు ఆరోపణ చేయడం- నేను సమాధానం చెప్పడం కాదు గానీ, ఒక పని చేద్దాం! ప్లాట్ల కేటాయింపులో అధికారులను నేను గానీ, మా సిబ్బంది గానీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం చేసినట్టుగా జగన్ అండ్ కో రుజువు చేస్తే సదరు ప్లాట్లను తిరుమల తిరుపతి దేవస్థానానికి విరాళంగా ఇచ్చేస్తాం. జగన్ అండ్ కో మాత్రమే కాదు ఇతరులు ఎవరైనా మేం అనుచిత లబ్ధి పొందినట్టు రుజువు చేసినా సదరు ప్లాట్లను వారికి ఉచితంగా ఇచ్చేస్తాం. మేం తప్పు చేసినట్టు లేదా అయాచిత ప్రయోజనం పొందినట్టు రుజువు చేస్తే సదరు ప్లాట్లను జగన్‌కి ఇవ్వడానికి కూడా మేము సిద్ధం.తాను చేసిన ఆరోపణలపై జగన్‌కు నమ్మకం ఉంటే ఈ సవాలును స్వీకరించాలి. లేదంటే, మానవ జాతి పరిణామ క్రమంలోనే జగన్ వంటి వ్యక్తి మరొకరు ఉండరని మేం భావించాల్సి ఉంటుంది.ఒళ్లంతా బురద పులుముకున్న ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను పూసుకున్న బురదను ఇతరులకు అంటించాలనుకుంటున్నారు. మానవ జాతిలో తనను మించిన ఉత్తమ పురుషుడు మరొకరు లేరని భ్రమిస్తున్న ఆయన, తనను వ్యతిరేకించే వారందరూ అవినీతిపరులని, హంతకులని చిత్రించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. అయితే ఉగాది పంచాంగ శ్రవణంలో ఆయన పిలిపించుకున్న పండితుడు ఈ ఏడాది గ్రహబలం అనుకూలంగా లేదని చెప్పినట్టుగానే జగన్‌రెడ్డి గురువారంనాడు విలేకరుల సమావేశంలో చేసిన విన్యాసాలు ఆయనకే ఎదురు తగిలాయి. తన తాత రాజారెడ్డి హత్య, తండ్రి రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదాలను ప్రస్తావించడం ద్వారా జనం మరచిపోయిన విషయాలను ఆయన గుర్తుచేశారు. తమ కుటుంబంలో జరిగిన హత్యలతో పాటు కొన్ని దశాబ్దాలుగా తెలుగునాట జరిగిన అనేక హత్యల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని చెప్పే ప్రయత్నం చేయడం ద్వారా 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అనే సామెతను గుర్తుచేశారు. నిజానికి జగన్‌రెడ్డి తాత వైఎస్ రాజారెడ్డి గురించి ఈ తరానికి తెలియదు. ఆయనను ఎవరు.. ఎందుకు హత్య చేశారో కూడా తెలియదు. హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన రాజశేఖరరెడ్డిని మహా నేతగా భావిస్తున్న ఈ తరం వారికి ఆయనకు కూడా ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న సంగతి తెలియదు. ఇప్పుడు పాత విషయాలను ప్రస్తావించడం ద్వారా తండ్రీ తాతల నేపథ్యం గురించి ఈ తరం వారు తెలుసుకొనే పరిస్థితిని జగన్‌రెడ్డి కల్పించారు. వైసీపీ అంటే గొడ్డలి పార్టీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవలి కాలంలో తరచుగా చురకలంటిస్తున్నారు. దీంతో జగన్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి హత్యా రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరు అని, తాను మంచోడు కనుకే తాత రాజారెడ్డిని చంపినవాళ్లు ప్రశాంతంగా బతకగలుగుతున్నారని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. అయితే రాజారెడ్డి వర్గీయులు చేసిన హత్యాయత్నం నుంచి ప్రాణాలతో బయటపడి ఆ తర్వాత తన వర్గీయులతో రాజారెడ్డిని చంపించిన పేర్ల పార్థసారథిరెడ్డి అప్పుడేం జరిగిందో కుండబద్దలు కొట్టారు.మొదట రాజారెడ్డి వర్గీయులు తనపై దాడి చేసి చంపే ప్రయత్నం చేశారని, ఆ సందర్భంగా తన శరీరంపై 26 కత్తిపోట్లు పడ్డాయని, తాను చనిపోయాననుకొని వదిలి వెళ్లిపోయారని ఆయన వివరించారు. అనంతరం తన వర్గీయులు రాజారెడ్డిపై దాడి చేసి చంపారని ఆయన జరిగింది జరిగినట్టుగా చెప్పుకొచ్చారు. వైఎస్ కుటుంబం వల్ల తన కుటుంబం ఆర్థికంగా చితికిపోయిందని కూడా ఆయన ఏకరువు పెట్టారు. పార్థసారథిరెడ్డిపై జరిగిన హత్యాయత్నం, ఆ తర్వాత జరిగిన రాజారెడ్డి హత్య ఫ్యాక్షన్ రాజకీయాలలో భాగమే! దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఇవి జరిగాయి. అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారు. ఇప్పుడు నేను అంత మంచివాడిని, ఇంత మంచివాడిని అని చెప్పుకొంటున్న జగన్మోహన్‌రెడ్డి అప్పట్లో తన తాత రాజారెడ్డిపై దాడి చేసిన వారిని చంపాలనుకున్నారు. ఈ విషయాన్ని వైఎస్ రాజశేఖరరెడ్డి స్వయంగా అప్పటి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అందరూ కాకాగా పిలుచుకొనే దివంగత వెంకటస్వామి వద్ద ప్రస్తావించారు. 'మా నాన్నను చంపినవాళ్లను చంపుతానని మా వాడు కత్తి పట్టుకొని తిరుగుతున్నాడు. జరగరానిది జరిగితే నా రాజకీయ జీవితం దెబ్బతింటుంది. ఏదైనా సలహా ఇవ్వండి' అని కాకాను రాజశేఖరరెడ్డి అప్పట్లో కోరారు. ఈ విషయాన్ని దివంగత వెంకటస్వామి ఓ సందర్భంలో నా వద్ద ప్రస్తావించారు. 'నీ కొడుకుని పులివెందుల పరిసరాల్లో ఉండనివ్వొద్దు' అని తాను రాజశేఖరరెడ్డికి సూచించినట్టు కాకా తెలిపారు. దీన్నిబట్టి జగన్‌రెడ్డి ఇప్పుడు చెప్పుకొంటున్నట్టుగా అంత మంచోడు కాదని స్పష్టమవుతోంది. తండ్రి రాజశేఖరరెడ్డి అడ్డుపడి ఉండకపోతే జగన్‌రెడ్డి చేతులకు కూడా రక్తం అంటి ఉండేదన్నమాట! కత్తి చేతబట్టినవాడు ఆ కత్తికే బలవుతాడు అని అంటారు. అప్పట్లో రెండు వర్గాలకు నాయకత్వం వహించిన రాజారెడ్డి, పార్థసారథిరెడ్డి ఫ్యాక్షన్ దాడులు జరిపించారు. రాజారెడ్డి మరణించగా, పార్థసారథిరెడ్డి ప్రాణాలు దక్కించుకున్నారు. ఇదంతా గతం. నిజానికి గురువారంనాడు ఏబీఎన్ డిబేట్‌లో పార్థసారథిరెడ్డి పాల్గొనే వరకు ఆయనే రాజారెడ్డిని చంపిన వారికి నాయకుడు అని ఈ తరానికి తెలియదు. రాజారెడ్డి హత్యా రాజకీయాలు చేసేవారన్న విషయం కూడా తెలియదు. ఇప్పుడు జగన్‌రెడ్డి పుణ్యమా అని వైఎస్ కుటుంబ నేర చరిత్ర గురించి తెలుసుకొనే అవకాశం ఈ తరానికి లభించింది. 2019--2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో అమలైన 'రాజారెడ్డి రాజ్యాంగం' అంటే ఏమిటో ఇప్పుడు జనబాహుళ్యానికి మరింతగా అర్థమవుతోంది.

**పాపాలే.. శాపాలై!**

తన తండ్రి రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంపై ఇప్పటికీ అనుమానాలు ఉన్నాయని జగన్‌రెడ్డి తాజాగా చెప్పడం ఈ మొత్తం ఎపిసోడ్‌లో హైలెట్! ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి తన తండ్రి రాజశేఖరరెడ్డి మరణంపై అనుమానాలు ఉన్నాయని ఒక్కసారి కూడా చెప్పలేదు. నాటి సంఘటనపై విచారణ జరిపించే ఆలోచనా చేయలేదు. రాజశేఖరరెడ్డి మరణం వల్ల ప్రజల్లో పెల్లుబికిన సానుభూతిని తన రాజకీయ పరమపద సోపానానికి వాడుకున్న జగన్‌రెడ్డి, అధికారంలోకి రాగానే అన్నీ మరచిపోయారు.

## డఫాబెట్.. బెట్టింగ్ కేసులో 11 మందిని అరెస్టు చేసిన సీఐడీ

మొదటి పేజీ తరువాయి
కరీంనగర్‌కి చెందిన ఓ బాధితుడు డఫాబెట్‌లో దాదాపు రూ.10లక్షలు మోసపోయిన కేసులో దర్యాప్తు ప్రారంభించిన సీఐడీ.. న్యూ ఢిల్లీ, గుజరాత్, పంజాబ్‌కు బృందాలను పంపి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో ఒక అఫ్గానిస్థాన్ దేశస్థుడు సహా 11 మందిని అరెస్ట్ చేశారు. వీరంతా బెట్టింగ్ నిర్వాహకులని సీఐడీ చీఫ్ చారు సిన్హా తెలిపారు. నిందితుల నుంచి 3 కార్లు, 8 ల్యాప్‌టాప్‌లు, 26 మొబైల్స్, 5 పాస్‌పోర్టులు, రూ.3.21లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై ఏపీ, గుజరాత్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణలో 225 కేసులు ఉన్నట్లు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసీఆర్‌కు మళ్లీ ఓట్లు అడిగే హక్కు లేదు

మొదటి పేజీ తరువాయి
ప్రజల వ్యక్తిగత గోప్యతను హరించిన కేసీఆర్‌కు మళ్లీ ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. "కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే లక్షల మంది ఫోన్లపై నిఘా పెడతారు. ప్రజల ఫోన్లపై నిఘా పెట్టి ఎవరెవరు ఓటు వేయలేదో తెలుసుకొని వేధిస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ఫోన్ ట్యాపింగ్ రాక్షసక్రీడలో ఎంతోమంది బలైపోయారు. వ్యవస్థీకృతంగా క్రూరమైన నేరం చేసిన వాళ్లు మళ్లీ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారు. జడ్జీలు, జర్నలిస్టులు, నటులు, రాజకీయ నేతలు ఇలా అన్ని వర్గాల ఫోన్లను ట్యాప్ చేశారు. బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉంది"అని అన్నారు.

## కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణే ఉత్తమమైంది: టీజీపీఎస్సీ ఛైర్మన్

మొదటి పేజీ తరువాయి
"మీడియాతో మాట్లాడకపోవడం కంటే మాట్లాడటమే మంచిదని భావిస్తున్నాం. అందుకే, ఇకపై 2, 3 నెలలకోసారి మీడియా సమావేశాలు నిర్వహిస్తాం. పరీక్షల విషయానికొస్తే కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణే ఉత్తమమైంది. ఈ విధానంలో పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నాపత్రం రూపొందించవచ్చు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్ష నిర్వహణ చాలా క్లిష్టమైంది. పరీక్షల నిర్వహణలో అనేక సంస్కరణలు తెస్తున్నాం. టీజీపీఎస్సీ పరీక్షలన్నీ కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే దిశగా వెళ్తున్నాం. ప్రతి నెలా 2, 3 నోటిఫికేషన్లు ఇస్తాం. ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉంది. ఇంకో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలు ఉన్నాయి. జూన్ 2న మూడు నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. 3,800 పోస్టులకు ఆర్థిక శాఖ నుంచి అనుమతి వచ్చింది. 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి" అని బుర్రా వెంకటేశం తెలిపారు.

## స్పోర్ట్స్ కోటాపై ఆరోపణలు అవాస్తవం: అజయ్ జైన్

మొదటి పేజీ తరువాయి
అమరావతి: డీఎస్సీ 2025 నియామకాల్లో స్పోర్ట్స్ కోటాపై వస్తున్న ఆరోపణలను ఏపీ ప్రభుత్వం ఖండించింది. అవన్నీ అవాస్తవాలని స్పోర్ట్స్ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ స్పష్టం చేశారు. 2024 డిసెంబర్‌లో ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని ప్రకటించిందని తెలిపారు. ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లను 2-3శాతానికి పెంచామని చెప్పారు. స్పోర్ట్స్ కోటా 65 క్రీడలకు వర్తిస్తుందన్నారు.
"డీఎస్సీ 2025లో 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. 3 శాతం రిజర్వేషన్‌లో భాగంగా 431 పోస్టులు స్పోర్ట్స్ కోటాకు కేటాయించాం. ఆన్‌లైన్‌లో 3,600 మంది దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ లిస్టులో 382 మందిని స్టేట్ లెవల్ కమిటీ ఎంపిక చేసింది. మరో 39 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. స్పోర్ట్స్ సర్టిఫికెట్లు జారీ చేసేది ఫెడరేషన్లు, అసోసియేషన్లు, వర్సిటీలే. ఆ సర్టిఫికెట్లను క్రీడాశాఖ, శాప్ జారీ చేయదు. స్పోర్ట్స్ కోటా దరఖాస్తుదారుల పత్రాలను అన్ని కోణాల్లో పరిశీలించాం. హైకోర్టులో 69 కేసులు నమోదు కాగా.. 3 కేసులు కొట్టివేసింది. మొత్తం 192 ఫిర్యాదులు అందగా.. అన్ని డిస్పోజ్ చేశాం. స్పోర్ట్స్ కోటాలో ఎంపిక అంతా సక్రమంగా జరిగింది"అని అజయ్ జైన్ తెలిపారు.

## అందుకే సూట్ వేసుకుంటున్నా.. అసలు విషయం చెప్పిన సీఎం విజయ్

తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ (జవీ ఎఱయిఖఎ) మొదటిసారి బహిరంగ ర్యాలీలో పాల్గొన్నారు. తిరుచ్చిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో తన పార్టీని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాకుండా ప్రజల సేవకుడిగా పని చేస్తానన్నారు. భవిష్యత్తులో జరగబోయే అన్ని ఎన్నికల్లోనూ ప్రజల మద్దతు లభిస్తుందని దృఢంగా నమ్ముతున్నానని అన్నారు. ఎన్నికల్లో తన విజయాన్ని దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ విజయంతో పోలుస్తున్నారని విజయ్ పేర్కొన్నారు. కానీ తాను అంత గొప్ప నేతతో పోల్చుకోవట్లేదని.. ఎంజీఆర్, అన్నా, పెరియార్ చూపిన మార్గంలో పని చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. రాష్ట్ర హక్కులు, లౌకికవాదం విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదన్నారు.
డీఎంకే- అన్నాడీఎంకేపై విజయ్ విమర్శలు గుప్పించారు. ఆరు నెలలపాటు మౌనంగా ఉంటామని చెప్పినవారు.. ఆరు రోజులు కూడా మౌనంగా ఉండలేకపోయారని అసహనం వ్యక్తం చేశారు. కుటుంబ రాజకీయాల వల్లే డీఎంకే (ణవీఖ) ఎన్నికల్లో ఓటమి చవిచూసిందన్నారు. ఇన్నేళ్లుగా వంతులవారీగా మోసం చేస్తున్న రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అయినప్పటికీ తన ప్రభుత్వాన్ని కూలదోసి అధికారం చేపట్టాలని ఆ పార్టీల నేతలు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. తమిళనాడు రాజకీయాల్లో ఇప్పటికీ ఎప్పటికీ పోటీ డీఎంకే-టీవీకే మధ్యే ఉంటుందన్నారు.
సూట్ ఎందుకు వేసుకోలేదు..?
ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి విజయ్ బ్లాక్ అండ్ వైట్ సూట్‌లోనే అన్ని అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారు. బహిరంగ సభకు ఆయన సూట్‌లో రాకపోవడంతో మీరు సూట్ ఎందుకు వేసుకోలేదని ఓ వ్యక్తి ప్రశ్నించాడు.

## వర్షాభావంపై రైతులకు అవగాహన

మొదటి పేజీ తరువాయి
ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోమ్, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా రైతులకు వర్షాభావ పరిస్థితులపై ముందస్తు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. అలాగే పంటల మార్పిడి, పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను అన్నదాతలకు వివరించాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల పనులపై కూడా సీఎం ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రాజెక్టుల గేట్లు, ఇతర నిర్వహణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టం, పశువుల నష్టం వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే యూరియా మొత్తం తెలంగాణ రైతుల అవసరాల కోసం కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

## 30 ఏళ్లలో తొలిసారి.. 'టెర్రర్ ఫ్రీ మంత్'గా మే

మొదటి పేజీ తరువాయి
2003 మేలో 241, 2004 మేలో 195, 2005 మేలో 188, 2006లో 140గా నమోదయ్యాయి. 2007 నుంచి క్రమంగా తగ్గుతూ వచ్చిన మరణాలు 2016 తర్వాత మళ్లీ తీవ్రమయ్యాయి. 2024 మేలో ఉగ్ర ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. 2025లో 43మంది మరణించారు.
సామూహిక వివాహాల్లో ఎమ్మెల్యే పెళ్లి.. ఎడ్లబండిపై ఊరేగింపు
కాగా, ఈ ఏడాది మొదటి ఐదు మాసాల్లో ఉగ్రవాద సంబంధిత మరణాలు కేవలం 12 నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ మే నెలలో మాత్రం ఒక్క మరణం కూడా సంభవించలేదన్నారు. జమ్మూ కశ్మీర్‌లో నిరంతరాయంగా కొనసాగుతున్న ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు.. మెరుగైన నిఘా సమన్వయం కారణంగానే ఈ మార్పు సాధ్యమైందని వారు పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చేవారు కూడా తగ్గిపోవడంతో ఈ నెట్‌వర్క్ బలహీనపడుతోందన్నారు. క్షేత్రస్థాయిలో ఉగ్రవాద గ్రూపులు తమ సామర్థ్యాలను తిరిగి నిర్మించుకోకుండా భద్రతా దళాలు నిరోధిస్తున్నాయన్నారు. ఈ ముప్పును పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.

## విద్వేషాలు సృష్టించేందుకు వైకాపా కుట్ర: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి
రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చే బాధ్యత మాది. గతేడాది యోగాంధ్ర బాగా చేశాం. ఈసారి అమరావతి కేంద్రంగా యోగా కార్యక్రమాలు చేపడతాం. రోజుకు అరగంట వ్యాయామం చేస్తే అనారోగ్యాలు రావు. అందరి జీవన ప్రమాణాలు పెరగాలనేది మా కల. పింఛన్లు ఇంటింటికే వచ్చి అందిస్తున్నాం. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. ఏ సమస్యకైనా ఆన్‌లైన్‌లోనే పరిష్కారం చూపుతున్నాం. పీ4 కార్యక్రమం కింద పేదలను ఆదుకుంటున్నాం. రాష్ట్రాభివృద్ధి కోసం పవన్, నేను కలిసి పని చేస్తున్నాం.
డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీ చేస్తే వైకాపా ఓర్వలేకపోతోంది. రాష్ట్రాభివృద్ధి చూసి.. ఆ పార్టీకి ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోంది. మత విద్వేషాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతోంది. వైకాపా అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నంద్యాలలో వైఎస్ విగ్రహంపై దాడి చేసి.. మాపై నెట్టాలని చూశారు. దాడి చేసిందెవరని ఆరా తీస్తే వైకాపా వాళ్లే చేసినట్లు రుజువైంది. విగ్రహం ధ్వంసం చేశారని అబద్ధాలు చెప్పి.. సానుభూతి కోసం ప్రయత్నించారు. దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

## మహారాష్ట్ర సీఎంతో ఏపీ మంత్రి లోకేశ్ భేటీ..

మొదటి పేజీ తరువాయి
ముంబయి: ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో ముంబయిలో భేటీ అయ్యారు. సాదర స్వాగతం పలికిన సీఎంను మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించి, శ్రీవారి ప్రతిమను లోకేశ్ అందజేశారు. గణేశ్ ప్రతిమను లోకేశ్‌కు సీఎం దేవేంద్ర బహూకరించారు. ఏపీకి వచ్చిన పెట్టుబడులు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మహారాష్ట్ర సీఎంకి వివరించారు. ఏపీ విద్యా శాఖలో తీసుకువచ్చిన సంస్కరణలు, స్కిల్ డెవలప్‌మెంట్ విధానాలు తెలియజేశారు. మహారాష్ట్ర ఐటీ, విద్యా శాఖలో అమలవుతున్న అత్యుత్తమ విధానాలు సీఎంను అడిగి తెలుసుకున్నారు.
అంతకుముందు వివిధ దేశాల్లో డేటా సెంటర్లు నిర్వహిస్తున్న హైపర్ స్కేల్ డేటా సంస్థ ఎయిర్ ట్రంక్ సీఈవో రాబిన్ ఖుదాతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖలో ఎయిర్ ట్రంక్ క్యాంపస్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐ, డేటా హైపర్‌స్కేల్ హబ్‌గా వైజాగ్ ఆవిర్భవిస్తోందని, గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్లు పురోగతిలో ఉన్నాయని వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ అన్నివిధాల అనుకూలమైనదని మంత్రి చెప్పారు. దీంతో ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని రాబిన్ ఖుదా హామీ ఇచ్చారు.

## ఎన్నో పోరాటాల ఫలితమే విశాఖ రైల్వే జోన్:

మొదటి పేజీ తరువాయి
శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక.. రైల్వే జోన్ సాకారమైందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎన్నో పోరాటాల ఫలితమే దక్షిణ కోస్తా రైల్వే అని తెలిపారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుపై ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద నిర్వహించిన సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త జోన్ ఏర్పాటుతో లక్షలమంది ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైల్వేను అభివృద్ధి చేస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతోనే కృషి చేసినట్లు చెప్పారు.
"రైల్వే జోన్ కోసం పార్లమెంట్‌లో నిరంతరం మాట్లాడా. ఇచ్ఛాపురం బ్రిడ్జి సమస్యకు కూటమి ప్రభుత్వంలోనే పరిష్కారం లభిస్తుంది. బ్రిడ్జి మాత్రమే కాకుండా అండర్ బ్రిడ్జిపైనా దృష్టి సారిస్తాం. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌ను రూ.12 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. ఇచ్ఛాపురం అంటే మూలన ఉండేది కాదు.. ముఖ ద్వారం కాబోతోంది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు ఉత్తరాంధ్ర ప్రజల తరఫున ధన్యవాదాలు" అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

## పేదలకు అత్యధిక పింఛన్లు ఇస్తున్నది కూటమి ప్రభుత్వమే



పాయకరావుపేట గ్రామీణం: దేశంలోనే అత్యధికంగా పేద లబ్ధిదారులకు పింఛన్లిస్తున్నది ఏపీలోని కూటమి ప్రభుత్వమేనని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామంలో సోమవారం హోం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామాల్లో సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే ప్రతినెలా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి వివరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సమస్యలు, ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నేతలు గెడ్డం బుజ్జి, కంకిపాటి వెంకటేశ్వరరావు, చించెలుపు పద్దు, యాళ్ల వరహాల బాబు, వడ్డాది వాసు, బొలిశెట్టి నాగేశ్వరావు, గూటూరు శ్రీనివాసరావు, కేరి పాల్గొన్నారు.

# చందుర్తిలో 15వ రోజుకు చేరిన వీఓఏల దీక్షలు.. సమ్మె శిబిరానికి తరలివచ్చి సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు!

**– ఆనాడు అసెంబ్లీలో అడిగినట్లే వీఓఏలకు వేతనాలు పెంచాలి.. మంత్రి సీతక్కకు బీఆర్ఎస్ నేతల డిమాండ్!**



చందుర్తి మండలం/ప్రజాదివాస్ జూన్ 01
చందుర్తి మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ పూర్తి మద్దతు ప్రకటించింది. గత 15 రోజులుగా మండుటెండలను సైతం లెక్కచేయకుండా వీఓఏలు దీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సోమవారం సమ్మె శిబిరం వద్ద సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలలో వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ హెచ్ఆర్ విధానాన్ని అమలు చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆనాడు అసెంబ్లీ సాక్షిగా ఇప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) వీఓఏల వేతనాన్ని రూ. 26,000కు పెంచాలని డిమాండ్ చేశారని, ఈరోజు ఆమె స్వయంగా అదే శాఖకు మంత్రిగా ఉన్నారు కాబట్టి ఆనాడు తాము అన్న మాట ప్రకారం గౌరవ వేతనాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే వీఓఏల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. వీఓఏలకు కనీస వేతనం రూ. 20,000 ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని, సాధారణ మరియు ఆరోగ్య బీమా సౌకర్యం కింద రూ. 20 లక్షలు కల్పించాలని, ట్యాబుల సౌకర్యంతో పాటు 58 జీఓను వెంటనే సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో కేడీసీసీ డైరెక్టర్ జలం కిషన్ రావు, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మరాటి మల్లిక్, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డప్పుల అశోక్, సర్పంచులు కపిల శంకర్, నరేష్, బీఆర్ఎస్ నాయకులు వీర్నపల్లి రాజు, బైరగొని రమేష్, దుమ్మ అంజయ్య, బత్తుల కమలాకర్, ప్రసాద్, రమేష్ రావు, ఆకుల ఎల్లయ్య, కమలాకర్ రావు, రవీందర్ రెడ్డి, పోతరాజు నాగేష్, శ్రీనివాస్ రెడ్డి, కిషన్, బొజ్జ తిరుపతి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బాలుడి తల్లి పెళ్లికి ఒప్పుకోలేదని దారుణం.. చాక్లెట్లు కొనిస్తానని తీసుకెళ్లి.. రోడ్డు కేసి బాలుడికి హత్య

ఉత్తర్ ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లా /ప్రజాదివాస్ జూన్ 01
ఉత్తర్ ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లాలో చోటుచేసుకున్న బాలుడి హత్య కేసుకు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బాలుడి తల్లి తనతో పెళ్లికి ఒప్పుకోలేదన్న కోపంతోనే నిందితుడు విరాజ్ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. పోలీసులు చెబుతున్న దాని ప్రకారం.. రతి, సుమిత్ భార్యాభర్తలు. వీరికి ఒకటిన్నరేళ్ల బాబు ఉన్నాడు. ఆ బాలుడి పేరు ఆరవ్. రతి బంధువుల ఊరికి చెందిన విరాజ్ అనే యువకుడు గత కొంతకాలం నుంచి ఆమెను ప్రేమిస్తున్నాడు. రతిని పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడు.కొన్ని రోజుల క్రితం రతి దగ్గర పెళ్లి ప్రస్తావన తెచ్చాడు. విరాజ్‌ను పెళ్లి చేసుకోవడానికి ఆమె ఒప్పుకోలేదు. దీంతో విరాజ్ రాక్షసుడిలా మారిపోయాడు. రతి తనను పెళ్లి




చేసుకోవడానికి బాలుడు అడ్డంగా ఉన్నాడని భావించాడు. బాలుడు లేకపోతే తన పెళ్లికి లైన్ క్లియర్ అవుతుందని, ఎలాగైనా బాలుడి అడ్డు తొలగించుకోవాలని అనుకున్నాడు. రెండు రోజుల క్రితం రతి బంధువు ఇంటికి వచ్చింది. ఈ విషయం విరాజ్‌కు తెలిసింది. వెంటనే రతి బంధువు ఇంటికి వెళ్లాడు. చాక్లెట్లు కొనిస్తానని చెప్పి బాలుడిని బయటకు తీసుకెళ్లాడు. తర్వాత అతి దారుణంగా హత్య చేసి చంపాడు. బాలుడిని చంపిన తర్వాత అక్కడినుంచి పరారయ్యాడు. చలనం లేకుండా నేలపై పడున్న బాలుడిని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు తేల్చారు. ఇక, సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసు బృందాలు విరాజ్ కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. నిందితుడు మెయిన్‌పురి రోడ్డులో వెళుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి విరాజ్‌ను చుట్టుముట్టారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి విరాజ్ తుపాకితో కాల్పులు జరిపాడు. పోలీసులు ఎదురు కాల్పులు జరపగా.. విరాజ్ కాలికి బుల్లెట్లు తగిలి కుప్పకూలాడు. పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో విరాజ్ చికిత్స పొందుతున్నాడు. పోలీసులు అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు. విరాజ్, రతికి మధ్య ఉన్న సంబంధం ఎలాంటిదన్న దానిపై దృష్టి సారించారు.

# వేములవాడ మార్కెట్ కమిటీ నూతన కార్యదర్శిగా సరోజన బాధ్యతల స్వీకరణ

**– రాజన్న చిత్రపటం అందజేసి శాలువాతో సత్కరించిన మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు**
**– అధికారులు, పాలకమండలి సమన్వయంతో రైతులకు మెరుగైన సేవలు అందించాలి**
**– రైతు సేవలే పరమావధిగా పనిచేయాలని చైర్మన్ సూచన**



వేములవాడ/ప్రజాదివాస్ జూన్ 01
వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యదర్శిగా సరోజన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చొప్పదండి నియోజకవర్గంలోని ధర్మారం మార్కెట్ కమిటీ నుండి ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా, ఇప్పటివరకు వేములవాడ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన సత్యనారాయణ ధర్మారంకు బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో సోమవారం కార్యాలయంలో సరోజన నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి సరోజనకు చైర్మన్ రొండి రాజు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని ఆమెకు అందజేసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ రొండి రాజు మాట్లాడుతూ.. వేములవాడ మార్కెట్ కమిటీ పరిధిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మార్కెట్‌కు వచ్చే ప్రతి రైతుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, మార్కెట్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అధికారులు, పాలకమండలి సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ఎల్లప్పుడూ మెరుగైన సేవలు అందించాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన కార్యదర్శి సరోజన మాట్లాడుతూ.. వేములవాడ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. చైర్మన్, పాలకమండలి సహకారంతో మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సిబ్బంది, పలువురు డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

# తెర్లమద్ది లో భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి

**– కట్టుకున్న బంధం– ఒక స్థితిపై ఇద్దరికీ అంత్యక్రియలు**
**– గ్రామంలో విషాద ఛాయలు శోక సముద్రంలో కుటుంబ బంధువులు**






ముస్తాబాద్/జూన్ 1 ప్రజా దివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తెర్లమద్ది గ్రామంలో విషాద సంఘటన ఒకే కుటుంబంలో ఇద్దరు భార్యాభర్తల మరణం గ్రామాన్ని కంటతడి పెట్టించింది వివరాల్లోకెళ్తే..మామిడాల ముత్తయ్య 70 సంవత్సరాలు అను అతను గత నాలుగు సంవత్సరాల నుండి పక్షవాదంతో బాధపడుతూ ఆదివారం మరణించడం జరిగింది తన భర్త మరణ వార్త విన్న తర్వాత తట్టుకోలేక మామిడాల మల్లవ్వ 65 సంవత్సరాలు వయస్సు సోమవారం గుండెపోటుతో మరణించడంతో భార్య భర్తలు ఇద్దరూ మరణించడంతో గ్రామంలో విషాద సంఘటన చోటు చేసుకుంది మూడుముళ్ల బంధంతో ఒకటైన ఆనాటి దంపతులు ఈనాడు కడసారి చూపులో కూడా ఇద్దరు మరణించడం ఇద్దరికీ ఒకే స్థితిపై అంత్యక్రియలు జరపడం వారి ఆత్మబంధానికి చివరి గమ్యం వరకు విడదీయరాని బంధం వారికి సంతానం కనకయ్య 35 మహేష్ 28 శ్యామల 30 సంగీత 25 నలుగురు కలరు వారి ప్రవిత ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్తులు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు కోరారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బైతి దుర్గవ్వ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు

# ముస్తాబాద్ మహిళా ఎస్సైగా జ్యోతి బాధ్యతలు స్వీకరణ



ముస్తాబాద్ /జూన్ 1 ప్రజా దివాస్
ముస్తాబాద్ మండలానికి నూతన మహిళ ఎస్ ఐ గా జి. జ్యోతి సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సి హెచ్ గణేష్ ను సిరిసిల్ల టౌన్‌కు బదిలీ చేయగా డి సి ఆర్ బి సిరిసిల్ల లో పనిచేస్తున్న జ్యోతి ఎస్‌ఐగా బదిలీపై ముస్తాబాద్ కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రత ల పరిరక్షణ కు కృషి చేస్తామని, అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక నిఘా ఉంచుతానని మండల అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రజలందరూ సహకరించి మండల అభివృద్ధికి సహకరించాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు నాయకులు, పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియచేశారు మండలంలోని శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, ప్రజలు ఎక్కడైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చట్ట వ్యతిరేక చర్యలకు దూరంగా ఉండాలని కోరారు

# అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

రాజన్న సిరిసిల్ల, జూన్ – 01 ప్రజా దివాస్



రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె సోమవారం సాయంత్రం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వేదిక, పరేడ్ నిర్వహణ, ప్రజాప్రతినిధులు, ప్రెస్, అధికారులు, తదితరులు కూర్చునేందుకు, వాహనాల పార్కింగ్, తదితర అంశాలకు సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులను అడిగి కలెక్టర్, ఎస్పీ ఆరా తీశారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ఎస్బీ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రవి, ఆర్ ఐ లు సురేష్, మధుకర్, తహసీల్దార్ మహేష్, తదితరులు ఉన్నారు.

## సీఎం ఇల్లు ముట్టడి.. ముందస్తు సమాచారంతో మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడి అరెస్ట్

**అరెస్టులతో సర్పంచుల పోరాటాన్ని అణచివేయలేరు: దుమ్మ అంజయ్య**

చందుర్తి మండలం/ ప్రజాదివాస్ జూన్ 01






ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి పిలుపునిచ్చారనే ముందస్తు సమాచారంతో రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామన్నపేట గ్రామ మాజీ సర్పంచ్, జిల్లా తాజా మాజీ సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు దుమ్మ అంజయ్యను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం ఆయనను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల అరెస్టులపై అంజయ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ నుండి ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా తమ సమస్యలపై నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం నియంత్రిస్తోందని విమర్శించారు. మాజీ సర్పంచుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి, ఇలా ఇళ్లపై పడి అరెస్టులకు పాల్పడటం సరికాదని మండిపడ్డారు. ఇటువంటి చర్యలతో సర్పంచుల పోరాటాలను అణచివేయలేరని, జిల్లా తాజా మాజీ సర్పంచుల జేఏసీ తరఫున ఈ అరెస్టులను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టులా? సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్ ఆగ్రహం

**అర్ధరాత్రి అరెస్టులతో సర్పంచుల ఉద్యమాన్ని అణచివేయలేరు: జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్**





వేములవాడ/ప్రజాదివాస్ జూన్ 01

ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి పిలుపునిచ్చారనే ముందస్తు సమాచారంతో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం స్తంభంపల్లి గ్రామ మాజీ సర్పంచ్, తాజా మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. తాము చేసిన పనులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా అడుగుతుంటే, పరిష్కరించాల్సింది పోయి ఇలా రాత్రికి రాత్రే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్పంచులను అక్రమంగా అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. అరెస్టులతో సర్పంచుల ఉద్యమాలను, వారి పోరాట పటిమను అణచివేయలేరని హెచ్చరించారు. ప్రభుత్వం నియంతృత్వ ధోరణి వీడి, తక్షణమే సర్పంచుల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు

## 6500 మంది పోలీస్ అధికారులతో మెగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన డీజీపీ సీవీ ఆనంద్...

హైదరాబాద్ /ప్రజాదివాస్ జూన్ 01



తెలంగాణలో సైబర్ నేరాలు, డ్రగ్స్, ట్రాఫిక్ సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీస్ శాఖ సరికొత్తగా మారాలని పిలుపునిచ్చిన డీజీపీ..రాష్ట్రంలో ఆహార కల్తీ నిరోధక విభాగంతో పాటు రోడ్ సేఫ్టీ, టెక్నాలజీ, విజిలెన్స్ కోసం కొత్త విభాగాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి.ప్రజల కోసం ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు సందర్శన వేళలుగా కేటాయించాలని ఆదేశం....

## కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ శ్రీరామరక్ష: AT యాదవ్

**– శబాష్‌పల్లిలో నాలుగు ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించిన స్థానిక సర్పంచ్ ఏ.టి. యాదవ్**

**– ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదల సొంతింటి కలల సాకారం: ఏ.టి. యాదవ్**









వేములవాడ/ప్రజాదివాస్ జూన్ 01

శబాష్‌పల్లిలో ఘనంగా లబ్ధిదారుల గృహప్రవేశాలు.. పాల్గొన్న జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలను పురస్కరించుకొని వేములవాడ అర్బన్ మండల పరిధిలోని శబాష్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన నాలుగు ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ ఉ సర్పంచుల ఫోరం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఏ.టి. యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులతో కలిసి ఆయన నూతన గృహాలను ప్రారంభించి, వారికి శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఏ.టి. యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని కొనియాడారు. గతంలో ఇందిరమ్మ రాజ్యం ఏ విధంగా పేదలకు అండగా నిలిచిందో, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే ప్రజాపాలనను అందిస్తోందని చెప్పారు. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని ప్రతి నిరుపేదకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రభుత్వం కొండంత భరోసా కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని యాదవ్ తెలిపారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రజా సంక్షేమంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, శబాష్‌పల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు సభ్యులు, లబ్ధిదారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరికలు

**– వట్టిమల్ల గొల్లపల్లి ఉపసర్పంచ్ బండ గణేష్‌తో పాటు 30 మంది కాంగ్రెస్ తీర్థం.. పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఆది**





వేములవాడ/ ప్రజాదివాస్ జూన్ 01

వేములవాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ మరింత బలోపేతమవుతోంది. నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు, ప్రజా రంజక పాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లోకి వలసలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ బండ గణేష్, నాయకులు నూనె నగేష్, బండ నవీన్ లతో పాటు సుమారు 30 మంది ముఖ్య నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వేములవాడలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వీరందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించేందుకు తాము నిరంతరం శ్రమిస్తున్నామని, పార్టీ నమ్ముకుని వచ్చిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి సముచిత స్థానం మరియు పూర్తి గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. నూతనంగా పార్టీలో చేరిన వారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వం వర్ధిల్లాలని, జై కాంగ్రెస్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.ఈ భారీ చేరికల కార్యక్రమంలో కోనరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానుక సత్యం, వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ బండ నరసయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఫిరోజ్ షేక్ పాషా, నాలుక సత్యం, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కచ్చకాయల బాలరాజు, మల్యాల మనోజ్, నీరటి సురేష్ లతో పాటు పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేసవి సెలవుల ముగింపు: శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు..

**కోడెలకు దారాల దండలు వేయరాదు, నిర్ణీత స్థలాల్లోనే కొబ్బరికాయలు కొట్టాలి.. భక్తులకు ఈవో రమాదేవి విజ్ఞప్తి**







వేములవాడ/ప్రజాదివాస్ జూన్ 01

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ భారీగా నెలకొంది. వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకోవడంతో పాఠశాలలు, హాస్టళ్లకు వెళ్లే ముందు విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే రుద్రాభిషేకం, అన్నపూజ, నిత్య చండీహోమం, నిత్య కల్యాణం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, లింగార్చన, ఆకుల పూజ తదితర విశేష పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ ఈవో ఎల్. రమాదేవి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించి, ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం, కోడె మొక్కుల క్యూలైన్ల వద్ద ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, క్యూలైన్లు, ఇతర సౌకర్యాలపై అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ, కోడెలకు దారాలతో అల్లిన దండలు వేయరాదని, కొబ్బరికాయలను ఎక్కడపడితే అక్కడ కొట్టకుండా ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్థలంలోనే కొట్టాలని భక్తులకు సూచించారు. దీనివల్ల ఇతర భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత కాపాడబడుతుందని తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తుల రద్దీ మధ్య ఆలయ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేయడంతో భక్తులు స్వామివారిని ప్రశాంతంగా దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

## జగిత్యాల జిల్లాలో లోన్ యాప్ వేధింపులు భరించ లేక యువకుని ఆత్మహత్య..



పెగడపల్లి మండలం /ప్రజాదివాస్ జూన్ 01

పెగడపల్లి మండల కేంద్రంకు చెందిన అక్కినపల్లి లిఖిత్ (21) అనే యువకుడు లోన్ యాప్ లో అప్పులు తీసుకోగా, వారి నుండి వేధింపులు అధికం అవ్వడంతో కొద్ది రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు, యువకున్ని హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈరోజు మృతి చెందగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పెగడపల్లి ఎస్సై కిరణ్ కుమార్

# హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రజాదివాస్
పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తరువాతనే నవ నిర్మాణ సభ పెట్టుకోవాలితెలంగాణ అస్థిత్వం,ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడిన పవన్ కళ్యాణ్ బీజేపీ ఎజెండా మోస్తున్నారు తెలంగాణ మీద విషం కక్కి తెలంగాణ ప్రజల చూపు పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని చెప్పిన పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం మానేసినా అని బహిరంగంగా చెప్పిన వ్యక్తి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే మాకు అభ్యంతరం లేదు కానీ ఇక్కడ నవ నిర్మాణ సభ పెడితే తీవ్ర ఆక్షేపిస్తున్నాం.కన్న తల్లికి గాజులు కొనలేని వాడు పినతల్లి కి ఒడ్డాణం చేస్తారని సమేత ఉంది.. కుట్ల రాయి తీయలేని వాడు..ఎట్లా రాయి తీస్తాడా..రేపు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం దీనిని ప్రతి తెలంగాణ బిడ్డ వేడుకల పండగల జరుపుకుంటాం..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కలిసి విడిపోయిన రాష్ట్రంగా మాకు ప్రేమ ఉంటది..భారతీయులుగా ఇతర రాష్ట్రాలను గౌరవించాలి..అవమాన
పరుచుకోవద్దు..తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలనుకుంటే ఎవరైనా పాల్గొనచ్చు..ఆంధ్రపదేశ్ ఉప ముఖ్యమంత్రి గా చేయలేనిది ఇక్కడికి వచ్చి నవ నిర్మాణ సభ పెడితే ఎవరు వినడానికి సిద్దంగా లేరు..తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినను అన్న వెధవ వచ్చి. ఇక్కడ తెలంగాణ పట్ల మొసలి కన్నీరు కారిస్తే ఒప్పుకోము వాస్తవంగా పవన్ కళ్యాణ్ సినిమా నటుడు .. . తెలంగాణ లో విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడి తెలంగాణ వాతావరణాన్ని కలుషితం చేయాలని బీజేపీ తో లోపాయికారి ఒప్పందం చేసుకొని పవన్ కళ్యాణ్ ఈ నటన స్టార్ట్ చేశారు..2014 లో నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు పోచేస్తున్నప్పుడు పవన్ కళ్యాణ్ ఇక్కడికి వచ్చారు.. తొడకలు తీస్తాం అని చెప్పం..తెలంగాణ కళ్ళ దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోయాయనీ చెప్పిన పవన్ కళ్యాణ్ తెలంగాణ రక్తం ఉన్న ఏ బిడ్డ ఆయన సభకు పోరు..బీజేపీ రెన్యుమనేషన్ ఇస్తే ఇక్కడికి రాలేదని కొండగట్టు అంజన్న మీద ప్రమాణం చేసి చెప్పు పవన్ కళ్యాణ్..మాకు అస్సాం కంటే ఆంధ్రప్రదేశ్ దగ్గర.. ఆంధ్రప్రదేశ్ తో సంత్సంబంధాలు ఉండాలని కోరుకుంటాం..తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినలేదని అన్న దానికి సమాధానం చెప్పు..తెలంగాణ కోసం పార్లమెంట్ సభ్యుడిగా ,సకల జనుల సమ్మె ద్వారా తెలంగాణ కోసం పోరాటం చేసినం..తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ,పోరాట యోధులను గుర్తించాలని ప్రభుత్వం కమిటీ వేసి ముందుకు పోతుంది.. వారిని గుర్తించి గౌరవించాలని ప్రభుత్వం కార్యక్రమం చేస్తుంది..తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన ఆయన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు ఇక్కడే ఎందుకు సభ పెడుతున్నారు..నవ నిర్మాణ సభ గుజరాత్ ,కేరళ , ఉత్తర ప్రదేశ్ ,తమిళనాడు లో ఎందుకు పెట్టడం లేదు..బీజేపీ డైరెక్షన్ లో తెలంగాణ లో విద్వేషాలు రెచ్చగొట్టి వైషమ్యాలు రెచ్చగొట్టేలా చేస్తే ఊరుకోరు.. పవన్ కళ్యాణ్ పైసలు ఇస్తే ఏం నటన చేయమంటే ఆది చేస్తాడు..మీరు సినిమా నటులు ఏమైనా మాట్లాడొచ్చు.. కానీ తెలంగాణ పై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం..మా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గాయపరిచేలా మాట్లాడిన వ్యక్తి వహిస్తే సహించం..పవన్ కళ్యాణ్ అభిమానులు సినిమా చూడండి కానీ మన తెలంగాణ అస్తిత్వం మీద దాడి చేస్తే ఎవరు చూస్తూ ఊరుకోరు ఇది ప్రజాస్వామ్య దేశం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం నడుస్తోంది ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడైనా సభలు సమావేశాలు పెట్టుకోవచ్చు. హైదరాబాదులో పవన్ కళ్యాణ్ నవనిర్మాణ సభ పేరు వెనుక ఆంతర్యం ఏమిటి.? బిజెపికి తెలంగాణను తాకట్టు పెట్టడమే మీరు స్థాపించే నవనిర్మాణమా? మీకు ఏపీ ప్రజలు ఆశీర్వదించి అధికారం ఇచ్చారు. అక్కడ చూయించండి మీ నవనిర్మాణము. కూట్లే రాయి తీయకుండా ఎట్ల రాయి ఇస్తానని బయలు తేరడం ఎందుకు? పవన్ కళ్యాణ్ నవనిర్మాణ సభలు బిజెపి పాలిత గుజరాత్ మధ్యప్రదేశ్ లో ఉత్తర ప్రదేశ్ లో ఎందుకు ఏర్పాటు చేయడం లేదు? మీ బాస్ మోదీ ను మెప్పించడానికి తెలంగాణ లో సభ పెడుతున్నారా..? తెలంగాణలో సభ ఏర్పాటు చేయాలి. నాలుగు రెచ్చగొట్టే మాటలు



మాట్లాడాలి. ఇక్కడ జనాలు తన్నుకు చావాలి . ఇదేనా మీ పవనిజం? అనువనవున తెలంగాణ వ్యతిరేకతను నింపుకున్న పవన్ కళ్యాణ్ మొదట తెలంగాణ వాదులకు క్షమాపణ చెప్పాలి. తక్షణమే తెలంగాణ ప్రజలకు మీరు క్షమాపణలు చెప్పాలి.. తెలంగాణ ద్వేషి పవన్ కళ్యాణ్. ఇక్కడ విద్వేష రాజకీయాలు చేస్తామంటే ఊరుకునేది లేదు.ఇక్కడ బిజెపి పప్పులు ఉడకక... ఏజెంట్ గా పవన్ కళ్యాణ్ ఇక్కడికి పంపిస్తున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణకు చేసిన ఏమీ లేదు. అందుకే ఇక్కడ బిజెపి దొడ్డిదారిన పవన్ కళ్యాణ్ ను పంపిస్తోంది.హీరోగా పవన్ కళ్యాణ్ ను అభిమానిస్తాం, ఆదరిస్తాం.. కానీ రాజకీయ నాయకుడిగా తెలంగాణ వ్యతిరేకిగా ముద్ర ఉన్న పవన్ కళ్యాణ్ ను నిలదీస్తాం.పవన్ సార్ధక నామదేయుడు. ఆయన వ్యవహార శైలి గాలివాట చందం. చేగువేరా టీ షర్టుతో ప్రారంభమైన ప్రస్థానం.. ఇప్పుడు మోడీ నీకు కౌగిలించుకొని ప్రజల చేత చీకట్టుకునే పరిస్థితి తెచ్చుకున్నాడు.తెలంగాణలో నువ్వు ఉద్ధరించేది ఏంటి పవన్ కళ్యాణ్... ఏపీ ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారు ఆదుకో. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేస్తుంటే గుడ్లు అప్పగించి చూసింది నువ్వు. కృష్ణపట్నం గంగవరం పోర్టులు పదానికి కట్టబెట్టిన మోడీని ప్రశ్నించని చేతగానితనం నీది.దేశంలో పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెరుగుతుంటే మారు మాట్లాడనిది నువ్వు. జనగణనలో కులగన చేపట్టకపోతే నోరు మెదపనిధి నువ్వు. సినిమాల్లో దేశభక్తి చూపించడం కాదు నిజజీవితంలో దేశభక్తి చూయించు పవన్ కళ్యాణ్. దేశంలో నిరుద్యోగం పెరుగుతుంది. నిరుద్యోగులంతా ఇబ్బంది పడుతున్నారు. మీ ఫ్యాన్స్ చాలామంది నిరుద్యోగులే ఉన్నారు. చేతనైతే వారికి ఉద్యోగాలు ఇప్పించు. కేవలం జై జైలు కొట్టించుకొని పస్తులు ఉంచడం తగదు.

# చందుర్తి శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ కార్యవర్గం ఎన్నిక



ప్రజాదివాస్
చందుర్తి మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ అభివృద్ధి కమిటీ ఎంపిక చేశారు.శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఎన్నిక సమావేశంలో అధ్యక్షులుగా మర్రి (షిరిడి) మల్లేశం, ఉపాధ్యక్షులుగా పిట్టల బాబు,కోశాధికారగా వులిసె గిరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అర్నేని సతీష్ రావు, సలహాదారులుగా పులి సత్యం గౌడ్, మర్రి కృష్ణ, పొంచెట్టి తిరుమల్, రాజూరి బ్రహ్మాచారి, దారం రామచంద్రం, పత్తిపాక వెంకటేష్ లను ఎంపిక చేశారు. నూతన కమిటీని శాలువాలతో సత్కరించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన చందుర్తి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గొట్టె ప్రభాకర్ మాట్లాడుతూ...చందుర్తి షిరిడి సాయిబాబా ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక చేయడం అభినందనీయమని, గతంలో నుండి ఆలయ అభివృద్ధితోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, నూతన కమిటీతో నూతనోత్సహం పెరుగుతోని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో శ్రీ షిరిడి సాయిబాబా భక్తుల పాల్గొన్నారు.

# భర్త వేధింపులకు భరించలేక ఎలుకల మందు వివాహిత ఆత్మహత్య ...

ప్రజాదివాస్
సనుగుల గ్రామం నకు చెందిన టేకుమాట్లా అంజవ్వ తన భర్త వేధింపులకు భరించలేక నిన్నటి రోజున బర్త్ ఆకయ్య కు మరియు మృతురాలి మద్య టూ వీలర్ కావాలనే విషయంలో గొడవ జరిగింది. మనస్తాపం చెందిన అంజవ్వ ఎలుకలు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. సమీప బంధువుల సహాయంతో వేములవాడ ప్రభుత్వ



ఆసుపత్రికి వెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించినది . కుటుంబ సభ్యుల కథనం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. మృతురాలి కి ముగ్గురు పిల్లలు కలరు

# ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్ లో వేగం పెంచాలి

**- వాహనాలు, హమాలీల సంఖ్యను మరింత పెంచాలి**
**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ధాన్యం కొనుగోళ్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్**

ప్రజాదివాస్
జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, అపరెల్ పార్క్, రైస్ మిల్లులు, గోదాంలలో అన్ లోడింగ్ వేగవంతం చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర



అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సోమవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం ఉన్న బస్తాలను వెంటనే అపరెల్ పార్క్, రైస్ మిల్లులు, గోదాములకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గన్నీ సంచులు, కొనుగోలు కేంద్రాల్లో చేస్తున్న ట్యాబ్ ఎంట్రీ, తదితర వివరాలు ఆరా తీశారు. కొనుగోళ్ళు పూర్తయిన కేంద్రాల నుంచి వాహనాలు, హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అన్ లోడింగ్ వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, వాహనాలను ఇతర కేంద్రాలను తరలించాలని సూచించారు.సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.
2

# ఐదుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేత

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు కృతజ్ఞతలు తెలియజేసిన దివ్యాంగులు**

రాజన్న సిరిసిల్ల, జూన్ -01 ప్రజా దివాస్



ఐదుగురు దివ్యాంగుల ఇబ్బందులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సత్వరం స్పందించి.. వారి సమస్యకు పరిష్కారం చూపారు.కోనరావుపేట మండలం వట్టిమల్లకు చెందిన లింగంపల్లి లక్ష్మి, వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ కు చెందిన నాగుల అశోక్, కోనరావుపేట మండలం సుద్దాల కు చెందిన కుడుకల దేవయ్య, కోనరావుపేట మండలం నిమ్మపల్లి కి చెందిన ఇద్దగిరి లక్ష్మణ్, తంగళ్లపల్లి మండలం నర్సిములపల్లికి చెందిన సోమురెడ్డి రాజు దివ్యాంగులు సోమవారం ఐడీఓసీకి రాగా, వారితో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. వారు ఎక్కడి నుంచి వచ్చారు? ఏ సమస్యపై వచ్చారో అడిగి తెలుసుకున్నారు. వారి ఇబ్బందిని తెలుసుకొని తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వారికి బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. వారికి వెంటనే బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు, హెల్మెట్ జిల్లా కలెక్టర్ అందజేశారు. తమ సమస్య, ఇబ్బందులను అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అమ్మపురం లో ఘనంగా సి బి సి కార్యక్రమాలు.

**- పిల్లల్లో ఆధ్యాత్మిక చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపు.**

ప్రజాదివాస్
నర్మెట్ట మండలం, అమ్మపురం గ్రామంలోని జీసస్ గాస్పల్ మందిరం నందు సి బి సి కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఆధ్యాత్మిక వాక్య భాగాలను బోధించారు. చిత్రపటాలు, చేతిపనులు మరియు రంగులు వేయడం లాంటి సృజనాత్మక కార్యక్రమాల ద్వారా పిల్లలలో మంచి చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన అర్హులైన పిల్లలకు దైవ సేవకులు పాల్సన్ రాజ్ రూతు, సి బి సి టీచర్లు చుంచు జ్యోతి మరియు ఏనుగుల జ్యోతి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సి బి సి టీచర్లు కు కూడా బహుమతులు ప్రధానం చేసి, శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు, సంఘ పెద్దలు, యవ్వనస్తులు, స్త్రీలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.





## గుర్తుతెలియని వ్యక్తులు పొలాలలోని వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో పశుగ్రాసం దగ్ధం

**బ్లూ కోర్ట్ సిబ్బంది రమేష్ మహిపాల్ ను పలువురు అభినందించారు**

ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో సోమవారం రోజున రోజున పొలాల వద్ద వరి కోయాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మండుటెండకు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పొలాలలోని గడ్డివాములు, స్టార్టర్లు, వైర్లు, బోరు పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. అటుగా వెళు



తున్న బ్లూ కోర్స్ సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. వారికి సహాయంగా కొందరు రైతులు కూడా వచ్చి మంటలను ఆర్పి వేశారు. సంఘటన స్థలానికి ఎస్సై సిహెచ్ శ్రీకాంత్ వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రైతులు తమ పశుగ్రాసం దగ్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు చేసిన పాపానికి మా యొక్క పశుగ్రాసం దగ్ధమైందని అన్నారు. బ్లూ కోర్ట్ సిబ్బంది రమేష్ మహిపాల్ లను పలువురు అభినందించారు.

## రోడ్డు భద్రత సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- చిట్యాలలో కనువిప్పు కళా ప్రదర్శన.**

ప్రజాదివాస్

సిద్దిపేట జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి బిజ్జూరి రవికుమార్ తెలంగాణ సాంస్కృతిక సారధి సంయుక్త ఆధ్వర్యంలో చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదాల నివారణ సైబర్ నేరాలపై పోలీస్ కనువిప్పు సారధి కళాబృందం ద్వారా ప్రజలను చైతన్య పరచగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చేర్యాల పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నవీన్ కుమార్ హాజరై మాట్లాడుతూ సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు అని అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు అని ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు యువత బెట్టింగ్ లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆన్లైన్ గేమ్స్ ఆడి మీరు మీ కుటుంబాలను రోడ్డున పడవేయవద్దని కోరారు చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్య చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దు అని మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడాలని సూచించారు, యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని విలువైన జీవితాలు ఆగం చేసుకోవద్దని కోరారు,తల్లిదండ్రులు వారి పిల్లలకు బాధ్యత నేర్పించాలని ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు ఉంటాయని



ఏదైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 100 కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు,ఈ కార్యక్రమంలో సర్పంచ్ జానకి స్వామి లీల,పోలీస్ కనువిప్పు బృందం బాలు,రాజు, తిరుమల, మరియు తెలంగాణ సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం,దూల్మిట్ట గెంటే హరిప్రసాద్,సనువాల కనుకయ్య,ఎల్ల సిద్దులు,తండ బిక్షపతి, తదితరులు ప్రజలకు అవగాహన కల్పించారు.

## అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



ప్రజాదివాస్

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె సోమవారం సాయంత్రం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వేదిక, పరేడ్ నిర్వహణ, ప్రజాప్రతినిధులు, ప్రెస్, అధికారులు, తదితరులు కూర్చునేందుకు, వాహనాల పార్కింగ్, తదితర అంశాలకు సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులను అడిగి కలెక్టర్, ఎస్పీ ఆరా తీశారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ఎస్బీ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రవి, ఆర్ ఐ లు సురేష్, మధుకర్, తహసీల్దార్ మహేష్, తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.. సంరక్షించాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా లిపర్యావరణ ఉత్సవాలు కింద మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, జిల్లా అధికారులు, యువత**



ప్రజాదివాస్

వాతావరణ సమతుల్యత.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని.. వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జూన్ 1 వ తేదీ నుంచి 12 వ తేదీ వరకు పర్యావరణ ఉత్సవాలలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమీపంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ సత్యనారాయణ, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, జిల్లా అధికారులు, యువత, విద్యార్థులు మామిడి మొక్కలు నాటి.. నీటిని పోశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడంతో ప్రస్తుతంతో పాటు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. పర్యావరణ ఉత్సవాల కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమాల్లో అందరినీ భాగస్వామ్యం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దీన్, ఉద్యానవన శాఖ అధికారి శరత్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

**- ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ముల్కల పవన్**

ప్రజాదివాస్

గన్నేరువరం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) మండల ప్రధాన కార్యదర్శి ముల్కల పవన్ మాట్లాడుతూ మండలంలో కళాశాల లేక విద్యార్థి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కళాశాల లేక చాలామంది పదవ తరగతి పూర్తి కాగానే మధ్యలోనే చదువు ఆపేసి ట్రాక్టర్లు డ్రైవర్లు గా కూలి పనులకు వెళ్తున్నారని అని అన్నారు చెడు వ్యసనాలకు



అలవాటుపడుతూ బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అన్నారు. మండలంలో జూనియర్ కళాశాల మోడల్ స్కూల్ లేవు ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఎక్కడో ఉండటం మండల విద్యార్థిలకు శాపంగా మారింది కాబట్టి మండల విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చొరువ చూపి మండలంలోని వెంటనే జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి లేనిచో మండల విద్యార్థులతో కలిసి రానున్న రోజుల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున విద్యార్థి ఉద్యమం చేస్తామని అన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

**- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 33 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

ప్రజాదివాస్

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 33 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ



ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## గంభీరావుపేట డిగ్రీ కళాశాలకు జాతీయ స్థాయి అవార్డు

**- జాతీయ స్థాయి అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి**

ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలకు ఈరోజు అనగా జూన్.1 -2026 పర్యావరణ పరిరక్షణ హరిత కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి గారు గ్లోబల్ పీస్ ఆడిటోరియం గచ్చిబౌలిలో జరిగిన జాతీయస్థాయి అవార్డు ప్రధాన ఉత్సవంలో ప్లాటినం క్యాంపస్ పార్టనర్-2026 జాతీయస్థాయి అవార్డు ప్రిన్సిపాల్ గారు అందుకోవడం జరిగింది. ఈ జాతీయ స్థాయి




అవార్డును రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ వారు కళాశాలలో పాటిస్తున్న పర్యావరణ పరిరక్షణ, పర్యావరణఅనుకూలత, నీటి సంరక్షణ, మొక్కల పెంపకం విధానాలను అవలంబించిన పద్ధతులకు గాను కళాశాలకు ఈ అవార్డు ప్రధాన చేయడం జరిగింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల గంభీరావుపేట జాతీయస్థాయిలో 44 స్థానం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి స్థానం దక్కినందుకు ప్రిన్సిపాల్ గారు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు రావడానికి కీలక పాత్ర పోషించిన బాటని అధ్యాపకులు సూచరణ్ ను అభినందించారు. ఈ కార్యక్రమానికి జువాలజీ అధ్యాపకులు డాక్టర్.కె. వి.బిక్షమయ్య విద్యార్థులు సామల్ల సంపత్, రాచర్ల హర్షిత తదితర విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# భగవద్గీతలో అసాధారణ ప్రతిభ,మైసూరు దత్తపీఠం స్వర్ణ పతక విజేత గీతికాశ్రీరెడ్డి




ప్రజాదివాస్

చిన్న వయస్సు.. అపారమైన ఏకాగ్రత. ఆధ్యాత్మిక చింతనతో భగవద్గీతలోని సర్వ శ్లోకాలను ఆకళింపు చేసుకుని, మైసూరు దత్తపీఠం నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది పఠాన్‌చెరువు నివాసి, బాలమేధావి సారెడ్డి గీతికాశ్రీరెడ్డి. ప్రస్తుతం 'అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్' (బీరంగూడ)లో 9వ తరగతి చదువుతున్న గీతిక, తన అసాధారణ జ్ఞాపకశక్తితో అందరినీ ఆశ్చర్యపరిచింది.గురువు ప్రోత్సాహం.. అంకితభావం గుంటూరుకు చెందిన ఉపాధ్యాయురాలు ప్రసన్న, జూమ్ వేదిక ద్వారా అన్ని వయస్సుల వారికి ఉచితంగా భగవద్గీత బోధిస్తున్నారు. ఈ క్రమంలో గీతికను ప్రోత్సహించి, ఆచిన్నారికి భగవద్గీతలోని శ్లోకాలన్నింటినీ కంఠస్థం చేయించారు. ఉపాధ్యాయురాలు ప్రసన్న అందించిన మార్గనిర్దేశనం, గీతిక కఠోర శ్రమకు తోడవ్వడంతో ఆమె భగవద్గీతలో ప్రావీణ్యం సంపాదించింది.మైసూరు దత్తపీఠంలో విజయదుందుభి మైసూరు దత్తపీఠం నిర్వహించిన వివిధ పోటీల్లో గీతిక పాల్గొని, వరుసగా ఆరుసార్లు ప్రథమ విజేతగా నిలిచి ఫైనల్ గా గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ ను ఈ ప్రతిష్టాత్మక వేదికపై పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి నుంచి సర్టిఫికెట్ అందుకుని వారి ఆశీస్సులు పొందింది. ఏ శ్లోకాన్ని ఎక్కడ అడిగినా తడుముకోకుండా చెప్పగల గీతిక ప్రతిభను చూసి పీఠాధిపతులు, భక్తులు ప్రశంసల వర్షం కురిపించారు.గీతిక తండ్రి సారెడ్డి కోటిరెడ్డి సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. తమ కుమార్తె చదువుతో పాటు ఆధ్యాత్మికంగా కూడా ఇంతటి గుర్తింపు పొందడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయస్సులోనే భగవద్గీతలోని సారాన్ని అర్థం చేసుకుని, క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని అలవర్చుకోవడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో గీతిక మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు అభినందిస్తున్నారు.

# గడ్డం శ్రీనివాస్‌కు పదోన్నతి..

- గడ్డం శ్రీనివాస్‌కు రాష్ట్ర ఎస్సీ విభాగానికి ఉపాధ్యక్ష పదవి..
- తెలంగాణ కాంగ్రెస్ ఎస్సీ విభాగంలో కీలక బాధ్యత..
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ సమక్షంలో నియామక పత్రం..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలకు ప్రత్యేక ధన్యవాదాలు..




ప్రజాదివాస్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం బేగంపేటలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక సేవ, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంలో విశేష కృషి చేస్తున్న డాక్టర్ గడ్డం శ్రీనివాస్‌కు ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ సిద్ధాంతాల పట్ల అంకితభావంతో పనిచేస్తూ, అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న డాక్టర్ గడ్డం శ్రీనివాస్‌కు ఈ బాధ్యత దక్కడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బలోపేతానికి తనవంతు కృషిని మరింత విస్తృతంగా కొనసాగిస్తానని డాక్టర్ గడ్డం శ్రీనివాస్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నాయకులకు తగిన గుర్తింపు లభిస్తోందని, డాక్టర్ గడ్డం శ్రీనివాస్ నియామకం అందుకు నిదర్శనమని సమావేశంలో పలువురు నాయకులు పేర్కొన్నారు.

# ఉద్యమకారులకు ఘన సన్మానం

ప్రజాదివాస్



శేరిలింగంపల్లి ఉద్యమకారుల సన్మాన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ పోరుబాట చేపట్టిన బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరీ రామచంద్ర యాదవ్ తోపాటు ఉద్యమకారులను ఘనంగా నిర్వహించారు. టిఆర్ఎస్ నాయకులు పొట్ట నరేందర్ యాదవ్, తెలంగాణ ఉద్యమకారుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో నల్లగండ్ల బ్రిడ్జ్ ఐసిఐసిఐ బ్యాంక్ వద్దగల ఫంక్షన్ హాల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉద్యమకారులకు ఘనంగా సన్మానించడం జరిగింది. శాలువాలతో ఉద్యమకారులకు మెంమోంటోలతో ప్రతి ఒక్కరికి సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ కోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన ఉద్యమకారుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించి వారికి ప్రభుత్వం తగిన గౌరవం అందించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని రెండు వందల యాభై గజాలు ఇంటి స్థలం, గుర్తింపు పత్రం ఇవ్వాలని ప్రభుత్వానికి సభాముఖంగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వెంకట్ రెడ్డి, మల్లికార్జున శర్మ నవత రెడ్డి మల్లేష్, ఆర్కే సాయన్న ముదిరాజ్, సంతోష్, గోవిందు చారి, నరసింహ చారి, ఉద్యమకారుల గురించి ప్రసంగించి ఉద్యమకారులకు న్యాయం జరగలేదని న్యాయం చేయాలని విన్నవించారు. ముఖ్యంగా పురుషోత్తం యాదవ్ తన సందేశంలో ఏ ప్రభుత్వాలు అయినా ఏ పార్టీ అయినా తెలంగాణను సాధించిన ఉద్యమకారులకు మర్యాదపూర్వకంగా చూస్తూ న్యాయం చేయాలని కోరుతున్నామని చెప్పారు. ఉద్యమకారులు కొంతమంది 1969 లోనూ 2001 నుండి 2014 వరకు ఉదృత ఉద్యమము చేసి కేసీఆర్ జయశంకర్ నాయకత్వంలో తెలంగాణ సాధించడం జరిగింది 1200 మంది ప్రాణాలను బలి ఇవ్వడమే కాకుండా 1969లో కూడా 370 మంది ప్రాణ త్యాగం చేయడం జరిగింది . 1949 నుండి 1953 ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ నిజాం నుండి విముక్తి కావాలని 1969 నుండి 1973 వరకు ఆంధ్ర వాళ్ళ నుండి విముక్తి కావాలని అదేవిధంగా 2001 నుండి 2014 వరకుసు దీర్ఘంగా పోరాటం చేసి ఉదృతంగా కేసీఆర్, జయశంకర్ నాయకత్వంలో సలహాలతో ఉద్యమించి రాష్ట్ర వ్యాప్తంగా కులాలకు మతాలకు అన్నింటికీ అతీతంగా పోరాడి తెలంగాణ సాధించుకోవడం జరిగిందన్నారు. నరేందర్ యాదవ్ తన సందేశంలో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరగలేదు, కాబట్టి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి వేసిన కమిటీ ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలని సభాముఖంగా కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా 1969, 2001, 2014 ఉద్యమంలో పాల్గొన్న ఆర్కే సాయన్న ముదిరాజ్ మాట్లాడుతూ ఉద్యమకారులకు న్యాయం చేయాలని టిఆర్ఎస్ ప్రభుత్వం కానీ తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వం కానీ తెలంగాణ సాధించినందుకు గుర్తింపుగా సంపూర్ణ స్వాతంత్రం కొరకు ఉద్యమించినందుకు న్యాయం చేయాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో సంతోష్ మిగతా వాళ్ళు కూడా ప్రసంగించారు. అందరు కూడా ఉద్యమకారులకు న్యాయం జరగాలని కోరడం జరిగింది. సామ వెంకట్ రెడ్డి వందన సమర్పణలతో సమావేశం ముగించారు. శేరిలింగంపల్లి ఉద్యమకారులు అందరు పాల్గొని సన్మాన సభను విజయవంతం చేయడం జరిగింది. నరేందర్ యాదవ్ తో పాటు మల్లికార్జున శర్మ, బేరి రామచంద్ర యాదవ్, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి, ఉద్యమ నాయకురాలు మమత, బాలరాజు, మల్లారెడ్డి, సామ వెంకట్ రెడ్డి, అందెల సత్యనారాయణ యాదవ్, పాశం రాజు యాదవ్, మేకల శ్రీనివాస్ యాదవ్, ఉద్యమకారులు అందరు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు ఒకటవ తారీఖున జీతాలు ఇవ్వాలి

- ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు చేయాలి
- మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి

ప్రజాదివాస్

గ్రామ పంచాయతీ సిబ్బందికి ఒకటవ తేదీన జీతాలు చెల్లిస్తామని ప్రతి నెల వేతనాలకు 50 కోట్లు ప్రభుత్వ బడ్జెట్లు కేటాయిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన హామీని వెంటనే అమలు జరపాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్‌డ వర్కర్స్ యూనియన్ (సిఐటీయు) జిల్లా అధ్యక్షులు అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. సోమవారం రోజున గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా బాల్ నర్సయ్య మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలు గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలన్నారు జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని 60 సంవత్సరాలు పైబడిన,ఆన రోగ్యం పాలైన సహజ ప్రమాదవశాత్తు మరణించిన ఇతర కారణాలవల్ల పనిచేయలేని కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పని కల్పించాలని కోరారు. గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల అందరి పేర్లను ఆన్లైన్లో నమోదు చేయాలని అన్నారు ప్రమాదం జరిగి మరణించిన సిబ్బందికి 20 లక్షల నష్టపరిహారం కుటుంబ సభ్యులు ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు మరణించిన కార్మికుని దహన సంస్కరణలకు 30000 ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గ్రామాలలో పనిచేస్తున్న ప్రతి గ్రామపంచాయతీ కార్మికునికి ప్రభుత్వమే గుర్తింపు కార్డులు, సబ్బులు నూనెలు శానిటేషన్ ఇతర సామాగ్రిని ఇవ్వాలని



ఈఎస్,ఐపిఎఫ్,బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బర్మ కొమురయ్య మండల కార్మికులు లింగారి యాదయ్య, లోకుల నర్సింలు, తుమ్మ అనిల్, తిరుపతి, చంద్రయ్య, మల్లయ్య, నర్సింలు, కిష్టవ్వ లింగవ్వ నాగమణి లక్ష్మి, ఎల్లవ్వ, తదితరులు పాల్గొన్నారు.

# నూతన పైపు లైనులు ,రోడ్లు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ప్రజాదివాస్

కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కె.పి.హెచ్.బి డివిజన్ లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రధానంగా గతంలో నిధులు మంజూరూ అయ్యి జరుగుతున్న నూతన పైపు లైనులు ,రోడ్లు పనులు మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వం హయాంలో కూకట్పల్లి నియోజకవర్గం లో కేపిహెచ్.బి డివిజన్ కు వందల కోట్ల నిధులు మంజూరు చేయించి నిరుపేదలకు ఉపయోగపడేటట్లు అనేక కార్యక్రమాలు నిర్వహించుకున్నామని ఇందులో ప్రధానంగా నాలుగో ఫేస్ లోఉంటున్న నిరుపేదలకు మరియు ఇతర ప్రాంతాల వారికి ఉపయోగపడేటట్లుగా అత్యాధునిక సదుపాయాలతో కమ్యూనిటీ హాల్ నిర్మించుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం దాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని అడిగితే కాంగ్రెస్ నాయకుల దగ్గర తాళాలు ఉంచుకుని ఈ కమ్యూనిటీ హాల్ కు చెత్తాచెదారం బూజులు పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదా అభివృద్ధి? నిరుపేదలకు తక్కువ రుసుముతో వారికి శుభకార్యాలు చేసుకునే విధంగా





దీన్ని ఉపయోగించాలని ఉద్దేశంతో కట్టించామని, కనీసం అధికారులు కూడా కాంగ్రెస్ నాయకులకు భయపడి ఇలా ప్రజలకు ఉపయోగపడే ప్రాపర్టీలను నిర్వీర్యం చేస్తున్నారని, ఇప్పటికైనా ప్రజలు దీన్ని గమనించాలని కోరారు. అలాగే మహిళా మండలి భవనం కూడా మహిళలకు ఉపయోగపడే విధంగా నిర్మించామని దాన్ని కూడా ఇదే స్థితిలో తీర్చిదిద్దారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నిరుపేదలకు మంచినీరు ఇబ్బంది రాకుండా పైపు లైనులు వాటర్ ట్యాంకులు నిర్మించడమే కాకుండా ఉచిత మంచినీటిని అందించామని, ఇప్పుడు నీటి కొరతతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే పార్కులు, సిమ్మింగ్ పూల్స్ ఇండోర్ స్టేడియంలు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటే కాంగ్రెస్ నాయకులు వాటన్నింటికీ బూజు పట్టించే ప్రయత్నం చేస్తున్నారని కనీసం ప్రజల గురించి కూడా ఆలోచించడం లేదని, తాను ఎప్పుడూ అభివృద్ధికి సహకరిస్తానని కానీ ఈ విధంగా చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, రాజేష్అ రాయ్, జున్ను సాయి శ్రీనివాస్, పాతూరి గోపి, భారతి, అన్ని విభాగాల అధికారులు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మేకల మైఖేల్ జన్మదిన కార్యక్రమాలు

ప్రజాదివాస్

సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ,కూకట్పల్లి నియోజకవర్గం,క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కోఆర్డినేటర్,మేకల మైఖేల్ జన్మదిన కార్యక్రమాలు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ శ్రీ హేమ దుర్గాభవన్లో జరిగాయి .ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మేకల మైకేల్ చేత కేక్ కటింగ్ చేయించి శాలువాతో సత్కరించి






జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులకు సముచిత గౌరవం ఉంటుందని,వారికి మంచి పదవుల లభించే లాగా తన వంతు కృషి చేస్తామని తెలిపారు కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు నాయకులకు మంచి పదవులు లభిస్తాయి అని పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, గాలి బాలాజీ, కొప్పిశెట్టి దినేష్ కుమార్,పిడికిటి గోపాల్ చౌదరి, అరవింద రెడ్డి , చలసాని నలినీకాంత్, రంగమోహన్,రామారావు, బాబ్జి, తదితరులు నాయకులు పాల్గొన్నారు.




## టాక్ యావరేజ్.. కలెక్షన్స్ సూపర్ హిట్.. మరి 'దృశ్యం 4' ఉంటుందా?

మోహన్‌లాల్ కీలక పాత్రలో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో వచ్చిన తాజా క్రైమ్ మిస్టరీ థ్రిల్లర్ 'దృశ్యం3' . గతం చిత్రాలకు కొనసాగింపుగా ఈ మూవీని తీర్చిదిద్దారు. మలయాళంతో పాటు, తెలుగులోనూ విడుదలైన ఈ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. మరీ ముఖ్యంగా ప్రథమార్ధమంతా సాగదీత వ్యవహారమంటూ సమీక్షకులు, విమర్శకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ అవేవీ 'దృశ్యం3' వసూళ్లను ఆపలేకపోయాయి. ద్వితీయార్థం, ముఖ్యంగా చివరి గంట కథ, కథనాలను ఆసక్తికరంగా థ్రిల్ పంచేలా నడపడంలో జీతూ మార్క్ కనపడింది. అదే ఇప్పుడు ఈ మూవీని నిలబెట్టింది. వసూళ్లలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ రూ.200 కోట్లకు పైగా రాబట్టి, అత్యధిక వసూళ్ల మలయాళ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.

### ఇండియాలో రూ.100 కోట్లు

మే 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ తాజాగా భారత్‌లో రూ.105 కోట్లు (గ్రాస్) రాబట్టింది. శనివారం దేశవ్యాప్తంగా 2,570 షోలు పడగా, రూ.5.05 కోట్లు వచ్చాయి. ఓవర్సీస్‌లోనూ ఈ మూవీని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా రూ.113.75 కోట్లు వసూలు చేయగా, మొత్తం రూ.219 కోట్లకు పైగా రాబట్టింది. తాజా వసూళ్లతో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన మలయాళ చిత్రాల్లో ఆరోస్థానంలో నిలిచింది. రూ.303 కోట్లతో ఇప్పటికీ 'కొత్తలోక: చాప్టర్1' టాప్‌లో ఉండటం గమనార్హం.

### దృశ్యం4 ఉంటుందా?

'దృశ్యం3' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైతే 'దృశ్యం 4, 5' కూడా రావొచ్చని మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ పలు వేదికలపై అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్నట్లుగా ప్రస్తుతం 'దృశ్యం3' బాక్సాఫీస్ వద్ద జోష్ చూపిస్తోంది. ఈ క్రమంలో నాలుగో భాగం వచ్చే అవకాశాన్ని కొట్టిపారేయలేం. అయితే, ఇప్పటికిప్పుడే అది సాధ్యమయ్యే పని కాదు. ప్రస్తుతం విజయాన్ని ఆస్వాదిస్తున్న చిత్ర బృందం నుంచి కూడా ఎలాంటి ప్రకటనా రాలేదు. అలాగని, చెప్పిన కథే మళ్లీ చెప్పి పిప్పి పిప్పి చేసి, చివరో ఓ ట్విస్ట్‌తో ముగిస్తానంటే కుదరదు. చూద్దాం..! దేనికైనా కాలమే సమాధానం చెబుతుంది.

## 'నో' చెప్పడం కూడా నేర్చుకుంటేనే...!

మాతృత్వ దశ తన జీవితాన్ని మార్చివేసింది కానీ తాను పనిచేసే విధానాన్ని మాత్రం మార్చలేదని అంటోంది బాలీవుడ్ కథానాయిక యామీ గౌతమ్. 'ఆర్టికల్ 370', 'హక్' లాంటి శక్తిమంతమైన కథలతో ప్రయాణిస్తున్న నాయికీమె. ఇటీవలే 'ధురంధర్ 2'లో అతిథి పాత్రలో మెరిసిన ఈమె.. ప్రస్తుతం 'నయీ నవేలి' అనే సినిమాతో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న యామి.. కొన్ని ఆసక్తికర విషయాలతో అభిమానుల ముందుకొచ్చింది. "ఇటీవలే నేను బాబుకి జన్మనిచ్చిన విషయం అందరికీ తెలిసిందే. కానీ తల్లి కావడం నా వృత్తిపరమైన ఎంపికలను ఏ మాత్రం ప్రభావితం చేయలేదు. వ్యక్తిగత, వృత్తిపర జీవితాల మధ్య సమతుల్యతను పాటించాలనే విషయం గురించి నాకు తెలుసు. ఒక్కసారి మీరు తల్లి అయ్యాక.. ఆ గుర్తింపు అన్నివేళలా మీతోనే ఉంటుంది. సెట్‌లో నేను ఒక నటిగా పనిచేస్తున్నప్పటికీ.. ప్రతి క్షణం నేను ఒక తల్లినే. మాతృత్వం అనేది గొప్ప భావోద్వేగం. ఇలాంటి అద్భుతమైన అనుభూతిని పొందినందుకు నేను చాలా అదృష్టవంతురాలిని".

### సందేహంగా ఒప్పుకున్నా.. సాగిపోవాలి

"సినీరంగంలో నా దశాబ్దాల కెరీర్‌ను వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా ఎదుగుదలకు దృఢ సంకల్పమే ముఖ్య కారణం. ఒకానొక దశలో నేను విజయాల వెంట పడటం మానేసి.. నా మనసుకు నిజంగా హత్తుకునే కథలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించాను. దీనికి సహనం ఎంతో అవసరం. మీరు అవకాశాలను వెతుక్కునే సమయంలో మీకు సరిపోయే ఆ ఒక్క సినిమాను, పాత్రను కూడా గుర్తించడం చాలా ముఖ్యం. ఈ క్రమంలో కొన్నిసార్లు 'నో' చెప్పడం కూడా నేర్చుకోవాలి. కొందరు సందేహంగానే కొన్ని ప్రాజెక్టుల్ని ఒప్పుకొని ఉండొచ్చు. అయినా మీరు ముందుకు సాగుతూనే ఉండాలి. అందరికీ కనిపించేలా పనిచేస్తూనే ఉండాలి".

### అతిగా ఆలోచించను

"జీవితంలో ఒక దశకు చేరుకున్న తర్వాత మనలో భయం పోతుంది. నా విషయంలో అది 'బాలా', 'ఉరి' సినిమాల సమయంలో జరిగింది. పాత్రలు నన్ను ఆకట్టుకుంటేనే వాటిని అంగీకరించాలని అప్పుడే గట్టిగా నిర్ణయించుకున్నా. నేను కొన్ని విషయాల గురించి అతిగా ఆలోచించను. నచ్చకపోతే.. అది నాకు వెంటనే తెలిసిపోతుంది. ఏదేమైనా నా మనసు చెప్పేదే నమ్ముతా".



## ఎప్పటికీ మీరే నా హీరో: మహేశ్‌బాబు పోస్టు

తన తండ్రి, నటుడు దివంగత కృష్ణ జయంతి సందర్భంగా మహేశ్‌బాబు ఎమోషనల్ పోస్టు పెట్టారు. 'ఎప్పటికీ మీరే నా హీరో. హ్యాపీ బర్త్ డే నాన్నా' అంటూ తండ్రిపై ప్రేమను వ్యక్తం చేశారు. మహేశ్ సతీమణి నమ్రతా శిరోద్కర్ కూడా కృష్ణను స్మరించుకున్నారు. ఎప్పుడూ ప్రేమతో మిమ్మల్ని తలచుకుంటూనే ఉంటామంటూ పోస్టు చేశారు

### కృష్ణ సేవలు చిరస్మరణీయం: సీఎం చంద్రబాబు

కృష్ణను స్మరించుకుంటూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. "తెలుగు సినీ పరిశ్రమకు నటుడిగా, దర్శకుడిగా, సాహసోపేత నిర్మాతగా విశిష్ట



సేవలందించిన పద్మభూషణ్ కృష్ణ గారి జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నా. నూతన సాంకేతికతలను పరిచయం చేస్తూ సినీ రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయం. అభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన ఆ మహానటుడికి ఘన నివాళులు" అని పేర్కొన్నారు.

# మే మెరుపుల్లేవ్!

వేసవి సినీ మారథాన్‌కి జూన్ క్లైమాక్స్ అయితే.. ప్రీక్లైమాక్స్ మే. జూన్ రెండో వారానికే సెలవుల సీజన్ ముగుస్తుంది కనుక.. ఈ సీజన్‌లో ఆఖరిగా వచ్చే బడా చిత్రాలన్నీ మేలోనే మెరుపులు మెరిపించేందుకు బాక్సాఫీస్ ముందుకు వరుస కడుతుంటాయి. అయితే కొవిడ్ తర్వాత నుంచి ఈ పరిస్థితులన్నీ పూర్తిగా తారుమారయ్యాయి. గత నాలుగైదేళ్లలో తెలుగు చిత్రసీమ ఒక్క వేసవి సీజన్‌నీ పూర్తిగా సొమ్ము చేసుకోలేకపోయింది. ఇక ఈసారైతే మరింత గడ్డు పరిస్థితి. సమ్మర్‌లో ఇంతవరకు సరైన సినిమా పడలేదని ఇటు ప్రేక్షక లోకం.. అటు సినీ పరిశ్రమ ముక్త కంఠంతో చెబుతోంది. మార్చి, ఏప్రిల్‌లో ఒకటి రెండు చెప్పుకోదగ్గ చిత్రాలైనా థియేటర్లలో సందడి చేసినా.. కీలకమైన మేలో ఒక్కటంటే ఒక్కటీ చెప్పుకోదగ్గ సినిమా కనిపించకపోవడం సినీ ప్రేమికుల్ని, పరిశ్రమ వర్గాల్ని కలవరపాటుకు గురి చేస్తోంది. ఈ మేలో నేరుగా తెలుగు




చిత్రసీమ నుంచి దాదాపు ఇరవై చిత్రాల వరకు బయటకొచ్చినా.. అందులో ఏ ఒక్కటీ ప్రేక్షకుల్ని థియేటర్ల బాట పట్టించలేకపోయింది. ఆ వచ్చిన వాటిలో ఏ ఒక్క దాంట్లోనూ స్టార్ కళ కనిపించకపోవడం.. ప్రేక్షకుల్ని థియేటర్ల బాట పట్టించే కంటెంట్ లేకపోవడం పెద్ద లోటు. మే తొలివారం తరుణ్ భాస్కర్ 'గాయపడ్డ సింహం', సత్య 'జెట్లీ' చిత్రాలు బాక్సాఫీస్ బరిలో తలపడ్డాయి. వీటిలో తరుణ్ సినిమాకి పాస్ మార్కులు పడ్డప్పటికీ.. థియేటర్లకు కళ తెచ్చే స్థాయిలో వసూళ్లు రాలేదు. ఆ మరుసటి వారం 'గోదారి గట్టుపైన', 'రేజర్', 'సతీ లీలావతి'.. ఇలా నాలుగైదు చిత్రాలు అదృష్టం పరీక్షించుకున్నాయి. కానీ, వీటిలో ఏ ఒక్కటీ సినీప్రియుల దృష్టిని ఆకర్షించలేకపోయాయి. ఇక మే చివరి మూడు వారాల్లో తెలుగు నుంచి 'దూరదర్శిని', 'హరుడు', 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోం', 'పురుషః', 'ఫస్ట్ టైమ్', 'రమణీ కల్యాణం', 'అగ్లీ స్టోరీ', 'త్రికాల', 'మరీచిక', 'సందిగ్ధం' లాంటి డజను వరకు చిన్న చిత్రాలు థియేటర్ల ముందుకొచ్చినా.. ఏ ఒక్కటీ కనీస వసూళ్లని కూడా రాబట్టలేకపోయింది. అనువాదాలు సొమ్ము చేసుకున్నాయి..

ఈ మేలో తెలుగు చిత్రసీమకి కూడా కాస్తోకూస్తో ఊపిరిపోసినవి అనువాద చిత్రాలే. మే రెండో వారంలో సూర్య 'వీరభద్రుడు' సినిమాతో.. మూడో వారంలో మోహన్‌లాల్ 'దృశ్యం 3'తో బాక్సాఫీస్ బరిలో సందడి చేశారు. నిజానికి వీటికి తెలుగులో సరైన ప్రచారం లేకున్నా... రివ్యూల పరంగా మిశ్రమ స్పందన లభించినా.. చెప్పుకోదగ్గ స్థాయిలో టికెట్లు తెగడం, మంచి వసూళ్లు రాబట్టడం విశేషం. కాస్త కంటెంట్ ఉన్న సినిమా పడి.. దానికి స్టార్ బలం కూడా తోడైతే ఎండల్నీ, ఐపీఎల్‌నీ లెక్క చేయకుండా జనాలు థియేటర్లకు వస్తారనడానికి ఈ అనువాదాలు నిదర్శనంగా నిలిచాయి. ఇక ఆఖరి వారంలో అర్జున్, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రల్లో నటించిన అనువాద చిత్రం 'బ్లాస్ట్'కు ప్రేక్షకుల నుంచి మంచి మౌత్ టాక్ లభిస్తోంది.

## ఇండస్ట్రీ సమస్యలు.. దాసరి దారి చూపారు..
## హీరోలకు మంచు మనోజ్ విజ్ఞప్తి

ప్రస్తుతం ఇండస్ట్రీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దర్శకరత్న దాసరి నారాయణరావు ఎప్పుడో దారి చూపారని మంచు మనోజ్ అన్నారు. దాసరి నారాయణరావు సమాధి దుస్థితి చూసి చలించిపోయిన ఆయన తన టీమ్‌తో కలిసి శుభ్రం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తన సతీమణి మౌనికతో కలిసి దాసరి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "గురువుగారు దాసరి వర్ధంతి అన్న సంగతి నాకూ గుర్తులేదు. చిత్రపురి కాలనీ వైపు వస్తుంటే, ఆ దారిలో గురువుగారి విగ్రహం ఉంటుంది. అది చూడగానే ఆయన కుటుంబం గుర్తు వచ్చింది. ఈలోగా ఆయన సమాధి పరిస్థితి తెలుసుకుని నా టీమ్‌తో కలిసి ఉదయాన్నే వచ్చేశా. అందరూ ఎంతో శ్రమించారు"

"దాసరిగారు గొప్ప దర్శకుడు. స్క్రీన్‌ప్లే రైటర్. ఎడిటింగ్, మ్యూజిక్, డైలాగ్స్ ఇలా అన్నింటిపైనా పట్టు కలిగిన వ్యక్తి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయనొక ఇనిస్టిట్యూట్. ఆయన ఎన్నో గొప్ప సినిమాలు తీశారు. సోషల్, కమర్షియల్, మహిళా ప్రాధాన్యమున్న చిత్రాలు రూపొందించారు. 'దాసరి పని అయిపోయింది' అని టాక్ వినిపించిన ప్రతిసారీ కొత్తదనంతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం మనం




థియేటర్స్ సమస్యలంటూ మాట్లాడుకుంటున్నాం. కానీ, నాకు తెలిసి గురువుగారు ఎప్పుడో దీనికి ఓ మార్గం చూపించారు. ఏడాదికి పది నుంచి పదిహేను సినిమాలు చేస్తూ.. ఎంతో మందికి ఉపాధి లభించేలా చేశారు. ఎప్పుడో ఓ సినిమా చేయటం కాదు.. ఎప్పుడూ సినిమా చేయాలని దాసరి అనేవారు. ఇకపై నాతో సహా అందరూ హీరోలు వీలైనన్ని ఎక్కువ సినిమాలు చేయాలని కోరుతున్నాను. ఆ బాధ్యత అందరిపైనా ఉంది. దాసరి ఘాట్‌ను పార్క్‌లా కాకుండా చుట్టు పక్కల పిల్లలు ఆడుకునేలా తీర్చిదిద్దితే బాగుంటుందని అనుకుంటున్నా" అని అన్నారు.